RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 19 సెప్టెంబర్ 2025 శుక్రవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:21 సంచిక:93

## సీఎం రేవంత్ తో బ్రిటిష్ హై కమిషనర్ భేటీ



హైదరాబాద్ యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్షిప్ విషయంలో కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించాలన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ సూత్రప్రాయంగా ఆంగీకరించారు.

భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. వారితో పాటు డిప్యూటీ హైకమిషనర్ (హైదరాబాద్) గారెత్ విన్ ఓవెన్, , పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్ కూడా ఉన్నారు.

యూకే ప్రభుత్వం అంతర్జాతీయ స్కాలర్షిప్ ప్రోగ్రామ్ లో భాగంగా అందిస్తున్న చెవెనింగ్ స్కాలర్షిప్ లను కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణకు చెందిన మెరిట్ విద్యార్థులకు అందించడానికి ఈ సందర్భంగా అంగీకరించారు. విద్య, సాంకేతిక సంబంధిత రంగాల్లో సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి కి వివరించారు. యూకేలోని యూనివర్సిటీల్లో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం అక్కడి వర్సిటీలు అడ్మిషన్లు, ఇతరత్రా కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో కొత్తగా తీసుకురానున్న ఎడ్యుకేషన్ పాలసీ ముసాయిదా గురించి ముఖ్యమంత్రి, బ్రిటిష్ హైకమిషనర్ కి వివరించారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ అందించడానికి లిండీ కామెరాన్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని, ప్రధానంగా జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమిలాకు సంబంధిత రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తి పట్ల బ్రిటిషన్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మరోసారి ఎలక్షన్ కమిషన్ మీద తీవ్ర ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీ



కాంగ్రెస్ అగ్రనేట రాహుల్ గాంధీ మరోసారి ఎన్నికల సంఘం పై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఆలంద్ నియోజకవర్గంలో 6,018 ఓట్లు తొలగించబడ్డాయి. ఈ విషయం యాదృచ్ఛికంగా బయటపడిందని అన్నారు. బూత్ స్థాయి అధికారి తన మామ ఓటు లేకపోవడం గమనించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని అయన అన్నారు.

## మేడారం జాతర మాస్టర్ ప్లాన్ సిద్ధం సిఎం ఆమోదం తర్వాత పనులు ప్రారంభం

### వందరోజుల్లోపు ఆధునీకరణ పూర్తి
### మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించిన మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి



హైదరాబాద్ :- తెలంగాణ కుంభమేళాగా పిలుచుకొనే మేడారం జాతరకు సంబంధించి ఆదివాసీ గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ఆధునీకరణ, భక్తులకు సౌకర్యాలు వంటి ప్రాధాన్యతా అంశాలతో కూడిన మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపు ఇవ్వడం జరిగిందని వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మాస్టర్ ప్లాన్‌కు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆమోదం లభించిన వెంటనే ఆధునీకరణ పనులు ప్రారంభించి వందరోజుల్లోగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. దేశం నలుమూలల నుంచి మేడారం మహాజాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన దర్శనం, ఇతర సౌకర్యాలు లభించే విధంగా అంగుళం తేడా లేకుండా శాస్త్రోపకరంగా సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనలు, సలహాలను ప్రతి అంశంలోనూ పరిగణనలోకి తీసుకొని మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందని తెలిపారు.

అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. గురువారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలోరాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించారు. గద్దెలను అభివృద్ధి డిజైన్ సమ్మక్క సారలమ్మ ప్రధాన ద్వారం డిజైన్ , ప్రహారీగోడ నిర్మాణానికి అవసరమైన రాతి డిజైన్ గద్దెల అభివృద్ధి తర్వాత అదనంగా ఎంత విస్తీర్ణం పెరుగుతుంది వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను రెండు రోజుల్లో సమర్పించాలని మాస్టర్ ప్లాన్ తయారుచేసిన కన్సల్టెన్సీని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు స్వయంగా మేడారం వెళ్లి అక్కడి పూజారులు, స్థానిక ప్రజల అందరి అభిప్రాయాలను తీసుకొని గద్దెల డిజైన్ తయారు చేయడం జరిగిందన్నారు. గతంలో భక్తులకు క్యూలైన్ల వలన పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం సరిగా లభించేదికాదు. మహాజాతర సమయంలో ఇది భక్తులకు ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు భక్తుల సౌకర్యార్థం గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నామని తెలిపారు.

తెలంగాణలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి గాంచిందని, ఇది గిరిజన సంప్రదాయ రీతికి దర్పణం పడుతుందని తమ కష్టాలను కడతేర్చే కలియుగ దైవాలుగా, వనదేవతలుగా సమ్మక్క సారలమ్మలను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారని తెలిపారు. సమ్మక్క సారలమ్మల త్యాగం, ఔన్నత్యం మరింత చాటి చెప్పేలా ఆలయ ప్రాంగణం రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మేడారం ఆలయం తో పాటు ఆ పరిసర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీపై సమీక్ష జరపాలి మండలి ఛైర్మన్ గుత్తా



నల్గొండ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియా మిత్రులతో చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుత్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య ,వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వైద్య రంగానికి ప్రభుత్వం ప్రతి ఏటా దాదాపు 1200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. అలాగే ఆరోగ్య శ్రీ, సీఎంఆర్ఎఫ్ పథకాలపై మరోసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు.

గతంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య వసతులు తక్కువగా ఉండటం కారణంగా పేదలకు ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స కోసం ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేసారు. కానీ నేడు తెలంగాణలోని 32 జిల్లాల్లో ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్మించడం జరుగుతుంది. అలాగే హైదరాబాద్ పట్టణంలో మరో నాలుగు పెద్ద ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్మాణంలో ఉన్నవి . ఈ ప్రభుత్వ హాస్పిటల్స్ ని అభివృద్ధి చేసి , ఆయా హాస్పిటల్స్ లో పని చేసే డాక్టర్స్ కి ప్రోత్సహకాలు ఇచ్చి మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను . హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లోని హాస్పిటల్స్ ని బలోపేతం చేయాలి. ప్రైవేట్ హాస్పిటల్ కి ఆరోగ్యశ్రీ నిధులను ఇవ్వాల్సిన అవసరం అప్పుడు ఉండదు. ఆరోగ్యశ్రీ , సీఎంఆర్ఎఫ్ నిధులను ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి వినియోగిస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం. ఫీజు రియంబర్స్ మెంట్ విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ స్కూల్ లు , కాలేజిలు , ప్రభుత్వ విద్యాసంస్థలు మెరుగుపరచాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రభుత్వ హాస్పిటల్స్ లో , ప్రభుత్వ విద్య సంస్థలలో పని చేసే ఉద్యోగులు బాధ్యతాయుతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

## కుమారుడి రిసెప్షన్‌క్యాన్సిల్ చేసి - రైతులకు రూ.2 కోట్లు ఇచ్చిన : మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్18 ఓ ప్రజా ప్రతినిధి తలచుకుంటే తన కుమార్తె/ కుమారుడు పెళ్లిని ఎంతో వైభవంగా జరిపించొచ్చు. ఆకాశమంత పందిరి వేసి, ఊరందరినీ పెళ్లికి ఆహ్వానించవచ్చు. రకరకాల పిండి వంటలు వండి, వచ్చిన అతిథులకు విందు భోజనం వడ్డించవచ్చు. కానీ ఈ ఎమ్మెల్యే అలాంటి హంగూ ఆర్భాటాలు ఏమీ చేయలేదు. చాలా సింపుల్?గా తన కుమారుడి వివాహం జరిపించారు. ఆపై రిసెప్షన్ చేయకుండా మానవతాకోణంలో ఆలోచించి, రైతులకు లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకుని ఆచరణలో పెట్టారు. వివరాల్లోకి వెళితే,

కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి : నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుమారుడి వివాహం ఇటీవల వైభవంగా జరిగింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే తన ఉదారతను చాటుకున్నారు. కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి, ఆ డబ్బులను తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా రూ.2 కోట్ల చెక్?ను రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు అందించారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్‌ను అందజేశారు. ఈ సహాయం ద్వారా లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు.ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మొదట భావించారు. అయితే రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. కుమారుడి రిసెప్షన్‌ను రద్దు చేసుకుని, ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చి ముఖ్యమంత్రికి రూ.2 కోట్ల చెక్ అందించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులను సీఎం అభినందించారు.

అసలు కథ ఇది : యూరియా కోసం రాష్ట్రంలో రైతులు ఇప్పటికే ఎరువుల దుకాణాల ఎదుట రైలు బండి మాదిరిగా క్యూలైన్లు కడుతున్న దృశ్యాలు చూస్తూనే ఉన్నాం. రాత్రీపగలు అనే తేడా లేకుండా తమ చెప్పులు, సంచులను క్యూలైన్లలో పెట్టి యూరియా బస్తాల కోసం వేచి చూస్తున్నారు. ఇతర పనులు మానుకుని మరీ పొద్దంతా ఎరువుల దుకాణాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. కొరతను నిరసిస్తూ కొన్నిచోట్ల నిరసన జ్వాలలు రేగుతుండగా, మరికొన్ని చోట్ల పోలీసుల బందోబస్తు మధ్య బస్తాల పంపిణీ కొనసాగుతోంది. ఇంత చేసినా అన్నదాతలకు సరిపడా ఎరువు బస్తాలు మాత్రం ఇంకా అందడం లేదు.

ప్రజాప్రతినిధులు, పలుకుబడి ఉన్నవాళ్లు ఫోన్లు చేసినా సరే ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. తాజాగా మిర్యాలగూడ ఎమ్మెల్యే తన నియోజకవర్గ ప్రయోజనాల కోసం రూ.2 కోట్ల చెక్? ఇచ్చి, ప్రభుత్వానికి తనవంతు సహకారం అందించారు. ఈ ఎమ్మెల్యేను ఆదర్శంగా తీసుకొని, మరింత మంది ప్రజాప్రతినిధులు ముందుకు వస్తారేమో చూడాలి. ఏదేమైనా తన కుమారుడి వివాహాన్ని గ్రాండ్‌గా చేయకుండా, ఇలా రైతుల కోసం ఆలోచించిన ఈ ఎమ్మెల్యే ఆలోచనకు సెల్యూట్ చేయాల్సిందే

ప్రజాబలం

19 సెప్టెంబర్ 2025 శుక్రవారం

## ప్రపంచ ప్రయోజనాలే ఎన్‌సిఒ లక్ష్యం

షాంగై కోపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సిఓ) శిఖరాగ్ర సమావేశాలు 2025 ఆగస్టు 31 నుండి సెప్టెంబర్ ఒకటి వరకు చైనాలోని టియాంజిన్ అనే నగరంలో జరిగాయి. ఈ సమావేశాలకు ఇరవై దేశాలకు చెందిన నాయకులు పది అంతర్జాతీయ సంస్థలు, పరిశీలన దేశాలు, చర్చల భాగస్వాములు, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్, అంతర్జాతీయ సంస్థల నాయకులు పాల్గొన్నారు. ఎస్‌సిఓ 2001లో చైనాలోని హువాంగ్పు నది ఒడ్డున ఏర్పడింది. నిజమైన బహుళ ధృవ ప్రపంచం, సరిహద్దు భద్రత సమస్యల పరిష్కారం, పరస్పర విశ్వాసం, పరస్పర ప్రయోజనం, సమానత్వం సంప్రదింపులు, విభిన్న నాగరికతల వైవిధ్యం పట్ల గౌరవం, ఉమ్మడి అభివృద్ధి సాధన అనే షాంగై స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. ఎస్‌సిఓ ఆరు సభ్యదేశాల నుండి పది దేశాలు, రెండు పరిశీలక దేశాలు, 14 సంభాషణ భాగస్వామ్య దేశాలతో ఒక పెద్ద ప్రాంతీయ అంతర్జాతీయ, భూ భౌగోళిక, భారీ జనాభా కలిగిన నేటి ప్రపంచంలో పెద్ద కుటుంబంగా ఏర్పడింది. నేటికీ కొన్ని పాశ్చాత్య దేశాలు ఉద్దేశపూర్వకంగా బహు పాక్షిక యంత్రాంగాలను, దేశాలను అణగదొక్కుతున్నాయి. దానికి భిన్నంగా ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు ఎస్‌సిఓ కృషి చేస్తుంది. దీని శిఖరాగ్ర సమావేశం, రెండో ప్రపంచ యుద్ధంలో జపనీస్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా ప్రజల ప్రతిఘటన యుద్ధం, ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం యొక్క 80వ వార్షికోత్సవం ఒకే చారిత్రాత్మక క్షణంలో జరుగుతున్నాయి. ఎస్‌సిఓ బహుళ ధ్రువ ప్రపంచ క్రమానికి వారసత్వంగా, పశ్చిమ దేశాల తరహా ఆదిపత్య క్రమాన్ని అభివృద్ధి చేయడం కాకుండా, కొత్త పరిస్థితులలో నేటి బహుముఖ దేశీయ ప్రపంచ ప్రజల అవసరాలకు అనుగుణంగా పునర్నిర్మాణం లక్ష్యంగా, ఎస్‌సిఓ ఒక బలమైన రక్షకుడిగా, నిజమైన బహుళ ధ్రువ ప్రపంచ ప్రజల ప్రయోజనాలే గీటురాయిగా పనిచేస్తుంది. టెర్రరిజం, వేర్పాటువాదం, భద్రత మరియు ఆర్థిక సహకారం, వాణిజ్యం పెట్టుబడులు, ఎనర్జీ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఆధునిక వ్యవసాయం, పర్యావరణహిత అభివృద్ధి, నిజమైన ఉమ్మడి దేశాల ప్రయోజనం, వాటి అనుసంధానం, దేశాల మధ్య భాగస్వామ్య భవిష్యత్తు లక్ష్యంగా పని చేస్తుంది.

నేటి అత్యంత సంఘర్షణతో కూడిన సంక్లిష్ట ప్రపంచంలో, ఈ సుదీర్ఘ క్రమంలో ఎస్‌సిఓ సభ్య దేశాల మధ్య అద్భుతమైన యంత్రాంగం ఏర్పడింది. స్థిరమైన అభివృద్ధిని, సమృద్ధిగా సహకార అవకాశాలను సఅష్టించింది. ఎస్‌సిఓ సభ్య, పరిశీలక, సంభాషణ భాగస్వామ్య దేశాల మధ్య వాణిజ్యం 890.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది చైనా మొత్తం విదేశీ వాణిజ్యంలో 14.4 శాతానికి సమానం. కజకిస్తాన్‌లో మూడు అత్యాధునిక వర్క్‌షాప్‌లు ప్రారంభించ బడ్డాయి. అత్యాధునిక వ్యవసాయ అభివృద్ధి పథకాలు ప్రారంభించబడ్డాయి. అనేక దేశాల మధ్య పరస్పర శ్రేయస్సు, సంఘీభావం, సహకారమే నేటి తీవ్ర సంఘర్షణ, సంక్లిష్టతలతో కూడిన ప్రపంచ సవాళ్లకు సరైన సమాధానం అని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. నేడు ఏక ధ్రువ నియంతృత్వ ఆదిపత్యం, రక్షణవాద ధోరణులు తీవ్రంగా పెరుగుతున్నాయి. శాంతి అభివృద్ధి, ప్రజాహిత పరిపాలన పూర్తిగా లోపిస్తున్నాయి. ఎస్‌సిఓ దేశాలు సగం ప్రపంచ జనాభాను కలిగి ఉన్నాయి. నాలుగింట్లో ఒక వంతు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. వీరి మధ్య ఐక్యత సహకారాన్ని బలోపేతం చేయాలి. భాగస్వామ్య భవిష్యత్తు, మరింత సన్నిహితంగా ఉండే సమాజాన్ని ప్రోత్సహించాలి. ఇది వారి సొంత అభివఅద్ధికి ప్రాంతీయ భద్రతకు ప్రయోజనం చేకూర్చడంతో పాటు ప్రపంచ స్థిరత్వానికి దోహదం చేస్తుంది. భారత్‌పై ట్రంప్ చేస్తున్న తీవ్రమైన అమెరికా స్వప్రయోజన వాణిజ్య యుద్ధం, భారత ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. భారత ప్రజలపై ట్రంప్ చేస్తున్న వాణిజ్యయుద్ధాన్ని, భారత్‌కు మేము తోడుగా ఉన్నామని ఖండించింది చైనా రష్యాలు మాత్రమే. ఈ నేపథ్యంలో 145 కోట్ల భారత్‌కు నిజమైన స్నేహితులు చైనా రష్యాలే అని నిజమవుతుంది. ఈ క్రమంలో పశ్చిమ యూరోప్‌లోని అనేక దేశాలు, నాటు సెక్రటరీ జనరల్, అమెరికా లాగే భారత్‌ను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. చైనా ఇండియాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలు, ఆర్థికంగా ద్వైపాక్షిక వాణిజ్యం క్రమంగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో స్వభావికంగా అనేక విషయాల్లో దగ్గరి పోలికలు ఉన్న చైనా-ఇండియాల మధ్య సంఘర్షణ కంటే సహకారానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఈ రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులు దగ్గర కావడం ఇష్టం లేని పశ్చిమ దేశాలు అమెరికాలకు తీవ్ర కడుపుమంటే. ఎస్‌సిఓ సమ్మిట్ అమెరికా పశ్చిమ దేశాల ఆధిపత్య ప్రపంచక్రమానికి బదులుగా బహుళ ధ్రువ సహకారం ద్వారా ఒక నూతన విలువలతో కూడిన ప్రపంచ క్రమాన్ని నిర్మించడమే. ప్రపంచ మానవాళి యుద్ధము శాంతి మధ్య, సంఘర్షణ సంభాషణల మధ్య, పరస్పర సహకారం, ఒకరు గెలిచి, మరొకరు ఎస్‌సిఓ సమ్మిట్ , దాన్ని అనుసరించే జరిగిన జపాన్ ఫాసిస్ట్ దురాక్రమణ వ్యతిరేక, చైనా ప్రజల ప్రతిఘటన యుద్ధం విజయోత్సవ 80వ వార్షికోత్సవం జరిగింది. అనేక దేశాలు ఈ సైనిక కవాతులో పాల్గొన్నాయి. ముఖ్యంగా చైనా జింపింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ పక్క పక్కనే పాల్గొనడం కీలకమైన విషయం. ఈ మూడు శక్తివంతమైన న్యూక్లియర్ పవర్స్. అమెరికా పశ్చిమ దేశాలకు ప్రత్యామ్నాయంగా ఒక శక్తివంతమైన కూటమి వెలిసింది. షిజిన్‌పింగ్, పుతిన్, కిమ్ ముగ్గురు నాయకులు కలిసి ఒకే వేదికపై ప్రపంచ ఫ్యాసిజాన్ని ఓడించిన సైనిక కవాతులో కనిపించడం వల్ల ప్రపంచ ప్రజల నిజమైన ప్రత్యామ్నాయం ఆవిష్కృతం అయిందా అన్నట్లుగా ఉంది. అమెరికా, పశ్చిమ దేశాల ప్రపంచ ఆధిపత్యానికి భిన్నంగా నిజమైన బహుళ ధ్రువ ప్రపంచం ఏర్పడుతుందని స్పష్టంగా అర్థమవుతోంది. డోనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియాలో చాలా వ్యంగ్యంగా పోస్ట్ చేస్తూ.. మనం భారతదేశం, రష్యాలను లోతైన, చీకటి చైనా చేతిలో కోల్పోయినట్లు కనిపిస్తోంది.. వారందరికీ సుదీర్ఘమైన మరియు సంపన్నమైన భవిష్యత్తు ఉంటుందా? క్రమంగా క్షీణిస్తున్న అమెరికా, ట్రంప్ ఏ దేశాన్ని వదిలిపెట్టడం లేదు అని పేర్కొన్నారు. ప్రపంచం అత్యంత సంక్లిష్టమైన అంతర్లీన సంబంధాలతో పెన వేసుకుంది. శాస్త్ర సాంకేతిక రంగంలో విప్లవాత్మక పరిణామాలు, ఎనర్జీ రంగంలో అనేక పునర్వ్యవస్థీకరణలు చోటు చేసుకుంటున్నాయి. పశ్చిమ దేశాల ఆధిపత్యానికి, ఎస్‌సిఓ, బ్రిక్స్‌లు ప్రపంచ ప్రత్యామ్నాయాలుగా మారాయి. ఈ సంస్థల్లోని దేశాలు డీడాలరైజేషన్‌ను వేగంగా అమలు చేస్తున్నాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ "ప్రపంచం తీవ్రమైన గందరగోళంలో ఉంది. ప్రపంచ క్రమం కొత్త పరివర్తనలోకి వెళుతుంది. ప్రపంచ పరిపాలన క్రమం కొత్త కూడలికి చేరుకుంది. ఈ సమయంలో చైనా అత్యా ధునిక ఆయుధ వ్యవస్థలతో కూడిన సైనిక కవాతు మానవాళి భవిష్యత్తుకు గొప్ప ప్రాముఖ్యత నిస్తుంది. చైనా ప్రజలు మానవ నాగరికత ప్రగతి యొక్క సరైన దిశ వైపు దృఢంగా నిలబడతారు. మేము తిరిగి శాంతియుత అభివృద్ధికి పునరంకిత మౌతాం. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కొరకు ప్రపంచ ప్రజలతో మేము చేతులు కలుపుతాం" అన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ లేనిదే ఆధునిక చైనా లేదు. చైనా ప్రజలు మానవ నాగరికత పురోగతి యొక్క చరిత్రకు సరైన వైపు నిలబడ తారు. చైనా శాంతిని ప్రేమించే ప్రపంచ ప్రజలతో కలిసి ప్రపంచశాంతి మరియు అభివృద్ధికై పాటుపడుతుందనీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొందాం అని బ్రిక్స్ దేశాలకు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ట్రంప్ ప్రకటించిన సంకాల యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. బ్రిక్స్ నేతల సదస్సు సెప్టెంబర్ 8న సోమవారం వీడియో కాన్ఫరెన్స్ రూపంలో జరిగింది. దీన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూనా డిసిల్వా నిర్వహించారు. ఈ సందర్భంగా జీపింగ్ ప్రసంగిస్తూ ఆధిపత్యవాదం, ఏకపక్షవాతం, రక్షణ వాదం రోజురోజుకు పెరుగుతున్నాయని ఇది వాణిజ్య యుద్ధాలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికా ప్రబల్యానికి వ్యతిరేకంగా ఆయన గ్లోబల్ గవర్నెన్స్ ఇనిషియేటివ్ (జిజిఐ) ని ప్రతిపాదించారు. ఈ సదస్సులో భారత విదేశాంగ మంత్రి జైశంకర్

# ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**పూర్తి పారదర్శకంగా ఏ శాఖలో లేని విధంగా రోడ్లు భవనాలు శాఖలో ప్రమోషన్స్ ఇచ్చాం**

**ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని ఒప్పించి ఆర్ అండ్ బి లో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రమోషన్స్ ఇప్పించాను**

**సర్వీస్ రూల్స్ అప్రూవల్ చేసుకొని రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చేలా కృషి చేశాను**

**ఒకేసారి 118 మంది AEE లు డి.ఈ లుగా ప్రమోషన్స్ పొందారు**

**శాఖ పరమైన సమస్యలు ఏమున్నా నా దృష్టికి తీసుకురండి**

**మీరు అడిగిన ప్రమోషన్స్ ఇప్పించా.. శాఖ బలోపేతం పై దృష్టి పెట్టి అదే స్థాయిలో పని చేయాలి**

**ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖ కు మంచి పేరు తీసుకువచ్చే బాధ్యత మీపై ఉంచాం**

**– మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**"మీరు ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన తర్వాతనే మా సమస్యలు పరిష్కారమై,రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చాయని" తమ అభిమానాన్ని,కృతజ్ఞతను వ్యక్తం చేసిన అసోసియేషన్ ఇంజనీర్లు

హైదరాబాద్:ఇటీవల ఎన్నికైన ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని మంత్రుల నివాస సముదాయంలోనీ తన క్యాంపు కార్యాలయంలో గురువారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ... పూర్తి పారదర్శకతో ఏ శాఖలో లేని విధంగా రోడ్లు భవనాలు శాఖలో ప్రమోషన్స్ ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి ఆర్ అండ్ బి శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్ అప్రూవల్ చేసుకొని రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చేలా కృషి చేశానన్నారు. తనను కలిసి వినతులు ఇచ్చినప్పుడు మీకు తప్పకుండా శాఖ పరమైన ప్రమోషన్స్ వచ్చేలా చేస్తానని చెప్పానని, ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి 118 మంది %ూజుజు% లు డి.ఈ లుగా ప్రమోషన్స్ పొందారని,అట్లాగే 72మంది డి.ఈ లు ఈ.ఈ లుగా, 29మంది ఈ.ఈ లు ఎస్. ఈ లు,ఎస్.ఈ లు సి.ఈ లుగా 6గురు,సి.ఈ నుండి ఈఎన్సి గా ఇద్దరు ప్రమోషన్స్ పొందారని గుర్తు చేశారు. శాఖలో సమూల మార్పులు తీసుకువచ్చి మీరు అడిగినవన్ని చేస్తున్నది,మరింత ఉత్సాహంతో పని చేస్తారనే నమ్మకంతోనే అని మంత్రి స్పష్టం చేశారు. మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ శాఖ బలోపేతం పై దృష్టి పెట్టి అదే స్థాయిలో పని చేసేందుకు కృషి చేయాలని,శాఖ పరమైన ఆమోదయోగ్యమైన సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇతర కేడర్లలో మిగిలిన పదోన్నతులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

ప్రజల్లో ఆర్ అండ్ బి శాఖ కు మంచి పేరు తీసుకువచ్చే బాధ్యత శాఖ ఇంజనీర్ల పైనే ఉందని..ఆ గురుతర బాధ్యతను గుర్తెరిగి ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలని మంత్రి వారికి హితబోధ చేశారు.

"మీరు ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన తర్వాతనే మా సమస్యలు పరిష్కారమై,రెగ్యులర్ ప్రమోషన్స్ వచ్చాయని" మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి అసోసియేషన్ తరుపున తమ అభిమానాన్ని,కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

మంత్రిని కలసిన వారిలో ఆర్ అండ్ బి ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్.శ్రీను,జనరల్ సెక్రటరీ బి.రాంబాబు,ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. శరత్ చంద్ర, ట్రెజరర్ మహేందర్ కుమార్,వైస్ ప్రెసిడెంట్లు కె.సంధ్య,వేణు,ప్రదీప్ రెడ్డి,జాయింట్ సెక్రెటరీలు నవీన్,కిషన్, అరుణ్ రెడ్డి పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు.

# కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలి

సిద్దిపేట 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు వయసు గల కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.

గురువారం సమీకృత కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పాఠశాల ఇంటర్మీడియట్, లేబర్, ఇండస్ట్రీస్, మెడికల్ మరియు హెల్త్, శిశు సంక్షేమ శాఖ మరియు సంబందిత ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు. జిల్లాలో కిషోర బాలికల సంఘాల ఏర్పాటు ప్రక్రియ గురించి దిశా నిర్దేషం చేశారు. కిషోర బాలికల సంఘాల ఏర్పాటుతో ఎన్నో సామాజిక రుగ్మతలను రూపు మాపవచ్చని పేర్కొన్నారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు జీవితంలో అత్యంత కీలక దశ అని, ఈ దశలో సరైన మార్గదర్శకం ఇస్తే కౌమార బాలికలు సమాజానికి దారి దీపము అవుతారని అన్నారు. బాల్యవివాహాలు, చదువు మానేయడం, రక్తహీనత, పోషకఆహార లోపం, వేధింపులు వంటి ఎన్నో సవాళ్లు కౌమార దశలో బాలికలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి బాలికకు అవకాశాలు కల్పించడమే నిజమైన సాధికారత అని స్పష్టం చేశారు. డిఆర్డిఓ, డిడబ్లుఓ లు ఈ సంఘాల ఏర్పాటులో భాగస్వాములు కావాలని, ఇలాంటి సంఘాల ద్వారా బాలికల సమస్యలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. కిశోర బాలికల భద్రత, పోషకాహారం, ఆరోగ్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనలో ఈ సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ, అటవీ ప్రాంతాల బాలికల సమస్యలు వేర్వేరుగా ఉంటాయని, వాటి స్వభావానుసారం నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సమాజంలో వ్యాపిస్తున్న అనేక రుగ్మతలకు రూపుమాపగలిగే శక్తి కిశోర బాలికలలో ఉందని, వీరిచే సంఘాలు ఏర్పాటు చేసి వీటిని బలోపేతం చేస్తే బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామాల వారీగా ఎస్ ఇ ఆర్ పి, ఏపిఎం లు,సిసి లు,మరియు వివో ఏ లు, ఈ సంఘాలను ఏర్పాటు చేయాలని అదే విధంగా జిల్లా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఈ సమావేశం లో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, అదనపు డిఆర్డిఓ సుదీర్, డీఎంహెచ్వో, జిఎం ఇండస్ట్రీస్ గణేష్ రామ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు టి.రేణుక, వాసుదేవ్, విద్యాసాగర్, డాకయ్య, రాకేశ్ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవన్నీ పూకార్లే,రాజ్ గోపాల్ రెడ్డి

నల్గొండ తనపై మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను పుకార్లను ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కొన్ని చానల్లో సోషల్ మీడియాలో నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బ తినే విధంగా తప్పుడు వార్తలు వస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఆంధ్రజ్యోతి పేపర్ ని తలపించేలా అందజ్యోతి అనే పేరుతో ప్రింట్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదన్న రాజగోపాల్ రెడ్డి అనే శీర్షికన నేను అనని మాటలు అన్నట్లు ప్రచురిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి గురించి మొట్టమొదటి అసెంబ్లీలో ప్రస్తావించిందే నేను. నాకు మంత్రి పదవి రానందుకు రేవంత్ రెడ్డి గారి పైన, ప్రభుత్వం పైన నేను అనని మాటలను అన్నట్టు తప్పుడు కథనాలను సృష్టించి అబద్దాలను ప్రచారం చేస్తున్నారు.

నా పైన వచ్చే తప్పుడు వార్తలను అబద్దాలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఒకసారి ఎంపీగా ఒకసారి ఎమ్మెల్సీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కాంగ్రెస్ పార్టీ అన్న సోనియా గాంధీ, అన్న రాహుల్ గాంధీ గారు అన్నా ఎంతో అభిమానమని అన్నారు. మా కుటుంబమే కాంగ్రెస్ పార్టీ నేపథ్యం . నేను రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని తప్పుడు వార్తలు రాస్తున్నారు. కొందరు గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవస్తవాలు పుకార్లు ప్రచారం చేస్తున్నారు . దయచేసి తెలంగాణ సమాజం పుకార్లను నమ్మకండి. కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కొన్ని సందర్భాలలో అంతర్గతంగా బహిర్గతంగా ఈ విధంగా చేస్తే బాగుంటుంది అని కొన్ని వేదికల్లో చెప్పడం జరిగింది. త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో కొంతమంది అనుకూలంగా మార్చుకున్నారని అనుమానాలు ఉన్నాయి. భూ నిర్వాసితుల విషయంలో కూడా తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం చెప్పాను. ఈరోజు కూడా నేను గుంటూరు ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తుంటే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ని కలవడానికి వెళ్తున్నాడని పుకార్లు సృష్టిస్తున్నారు. నేను గుంటూరు వెళుతున్నాను అంటే మా నియోజకవర్గంలో నుంచి కూడా కొంతమంది నాయకులు నాతో వస్తా అన్నారు. నేను మా నాయకులు కలిసి గుంటూరులో ప్రవేట్ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత అటు నుండి విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకొని వద్దామని వెళ్తున్నాం. దానికి నేను జగన్ ని కలవడానికి వెళు న్నానని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. నా రాజకీయం గురించి నా భవిష్యత్తు గురించి నేను మీడియా సమావేశం పెట్టి చెబుతాను తప్ప అప్పటివరకు ఈ దుష్ప్రచారాలను నమ్మకండని తెలంగాణ సమాజాన్ని కోరుతున్ననని అన్నారు.

## నందిగామలో మునిసినల్ ఉద్యోగుల నిరసన

నందిగామ ఎ పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సి ఐ టి యు నందిగామ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది

ఈ ధర్నా నిర్దేశించి సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడుతూ... 12వ పి ఆర్ సి నీ వెంటనే ప్రకటించాలి, మున్సిపల్ కార్మికులందరికీ పి .ఆర్.సి గీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 18వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో ధర్నాలు, 23వ తేదీ విజయవాడలో జరిగే ధర్నాలను జయప్రదం చేయండని అన్నారు.

రాష్ట్రంలో ఉద్యోగులు ఉపాధ్యాయులతో పాటు లక్షలాదిమంది ఒప్పంద కార్మికులు 12వ పి ఆర్ సి కోసం ఎదురుచూస్తున్నారు. 11వ పి ఆర్ సి గడువు పూర్తయి రెండు సంవత్సరాలు దాటింది. ఇంతవరకు 12వ పి.ఆర్.సి కమిటీని వేయలేదు. ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 12వ పిఆర్సిని వెంటనే ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నందిగామ కమిటీ ప్రభుత్వాన్ని , డిమాండ్ చేస్తున్నది. గత జులైలో జరిగిన సమ్మె కాలానికి జీతం చెల్లిస్తావని ప్రభుత్వం హామీ ఇచ్చింది కానీ నేటికీ జీతం చెల్లించలేదు. గతంలో 17 రోజుల సమ్మె జరిగిన సందర్భంగా నాటి ప్రభుత్వం హామీ ఇచ్చింది ఇంతవరకు అమలు కాలేదని అన్నారు. .

నందిగామ పట్టణంలో పెరిగిన నివాస ప్రాంతాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలి. ప్రభుత్వం బ్యాంక్ అకౌంట్ లో మారుస్తుంది కార్మికులు సంతకంతో పని లేకుండా కార్మికులందరికీ అకౌంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# లండన్ ను చుట్టేస్తున్న లోకేష్



విజయవాడ, సెప్టెంబర్ 18, ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు మంత్రి నారా లోకేష్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన తరచూ విదేశాల్లో పర్యటిస్తూ దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారు. ఇలా కలిసే క్రమంలో చాలామంది పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నారా లోకేష్ లండన్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో పెట్టుబడి పెట్టబోయే పారిశ్రామికవేత్తలతో సమావేశం అవుతున్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించేందుకు మాత్రమే నారా లోకేష్ లండన్ పర్యటన కొనసాగుతోంది. మరోవైపు తన పర్యటన విజయవంతంగా జరుగుతున్నట్టు నారా లోకేష్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతా ద్వారా తెలిపారు. లోకేష్ పర్యటన ఆంధ్రప్రదేశ్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.విశాఖ సమ్మిట్ కు ప్రచారంగా.. విశాఖలో త్వరలో ఏపీ ప్రభుత్వం పార్టనర్షిప్ సమ్మిట్-2025 నిర్వహిస్తోంది. నవంబర్ 14, 15 తేదీల్లో జరగనున్న ఈ సమ్మిట్ కు సంబంధించి లండన్ లో లోకేష్ భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సమ్మిట్ ను భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, ఏపీ ప్రభుత్వం, కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. లండన్ లో పెట్టుబడుదారులను ఆకర్షించేందుకుగాను సుమారు 150 మంది పెట్టుబడిదారులతో ఈ రోడ్ షో కొనసాగనుంది. ముఖ్యంగా లోకేష్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, ఫిన్ టెక్, ఫార్మా, హెల్త్ కేర్, డీప్ టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడ్ టక్ వంటి రంగాలపై దృష్టి పెట్టారు. ఈ రంగాలలో ఏపీలో ఉన్న అవకాశాలను వివరించే ప్రయత్నం చేశారు.లోకేష్ లండన్ పర్యటన విజయవంతంగా జరుగుతోంది. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని ఆయన వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా చంద్రబాబు విజన్, డిజిటల్ గవర్నెన్స్, ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి విధానాలను అక్కడి పారిశ్రామికవేత్తలకు వివరిస్తున్నారు. ఈ రోడ్డు షో ద్వారా పెట్టుబడులను ఆకర్షించి.. కొత్త ఉద్యోగాలను సృష్టించాలన్నదే లోకేష్ లక్ష్యంగా కనిపిస్తోంది. గత ఏడాది అమెరికాలో పర్యటించారు నరా లోకేష్. శాన్ ఫ్రాన్సిస్కో లో కూడా ఇలాంటి ప్రచారాలు నిర్వహించారు. అప్పట్లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, అడోబ్ సీఈవో శాంతను నారాయణన్ తో సమావేశం అయ్యారు. దీంతో కొన్ని సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధపడ్డాయి. ఆ మధ్యన లోకేష్ సీఎం చంద్రబాబు తో కలిసి సింగపూర్ పర్యటనకు వెళ్లారు. కొన్ని సంస్థలతో ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా లండన్ పర్యటన ఏపీకి గేమ్ చేంజర్ అవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# టీడీపీకి మరో గవర్నర్ పదవి

విజయవాడ, సెప్టెంబర్ 18, ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీకి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరో బిగ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. కూటమి గా ఏర్పడిన గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో సూపర్ సక్సెస్ సాధించిన తర్వాత టీడీపీకి బీజేపీ వరస ఆఫర్లు ఇస్తుంది. అందులో భాగంగా కేంద్రంలో రెండు ముఖ్యమైన మంత్రి పదవులు ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాలుగా ఆర్థిక సాయం అందిస్తుంది. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు వెనువెంటనే గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. అప్పులు చేయడానికి అవసరమైన అనుమతులను కూడా వేగంగా ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడానికి చేయూతగా కేంద్ర ప్రభుత్వం నిలుస్తుంది.దీంతో పాటు తాజాగా మరొక కీలమైన కబురు కేంద్ర బీజేపీ నుంచి వచ్చినట్లు తెలిసింది. విశాఖలో యోగాడే అద్భుతంగా నిర్వహించిన చంద్రబాబుకు ప్రధాని మోదీ గిఫ్ట్ ల మీద గిఫ్ట్ లు ఇస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగానే ఇప్పటికే ఏపీకి రెండు గవర్నర్ పదవులు ఇచ్చాయి. ఒకటి బీజేపీకి చెందిన హరిబాబుకు గవర్నర్ పదవి లభించగా, మరొకటి టీడీపీకి చెందిన అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కింది. సీనియర్ నేతగా ఉన్న అశోక్ గజపతి రాజు గోవా గవర్నర్ గా బాధ్యతలను స్వీకరించారు. ఇప్పుడు టీడీపీకి మరొక గవర్నర్ పదవి ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖం వ్యక్తం చేసిందన్న సమాచారం అందడంతో ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. చాలా మంది సీనియర్లు... టీడీపీలో చాలా మంది సీనియర్లకు గత ఎన్నికల్లో టిక్కెట్లు లభించలేదు.కొందరు టీడీపీ సీనియర్లు పార్టీలో తొలి నుంచి సేవలు అందించారు. వయసు పెరిగి పోవడంతో వారి సేవలను పార్టీకి కాని, మరొక రూపంలో కానీ వినియోగించుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు యోచిస్తున్నారు. అందులో యనమల రామకృష్ణుడు పేరు వినిపించినప్పటికీ దాని విషయంలో కొన్ని ఇబ్బందులున్నాయి. యనమల కుటుంబానికి ఇప్పటికే చాలా పదవులు ఇచ్చారు. అదే సమయంలో యనమల తనకు రాజ్యసభ పదవి కావాలని కోరుతున్నారు. అందుకే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకున్న కేఈ కృష్ణమూర్తి పేరును చంద్రబాబు నాయుడు పరిశీలిస్తున్నట్లు సమాచారం. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన క్షత్రియ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో, రాయలసీమకు చెందిన బీసీ నేత కృష్ణమూర్తిని గవర్నర్ గా పంపాలని చంద్రబాబు దాదాపు డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. మరి నిర్ణయం ఎలా ఉంటుందో?

# వైసీపీ ఓటర్లపై కమలం గురి

కాకినాడ, సెప్టెంబర్ 18, ఇదే సరైన సమయం. వైసీపీతో మనకు ఎలాంటి చీకటి ఒప్పందం లేదు. అంతర్గత దోస్తీ అంతకంటే లేదు. ఈ విషయం ఏపీ ప్రజలకు క్లారిటీ ఇవ్వాలి. ఏపీలో కాషాయం బలపడాలంటే ఫ్యాన్ పార్టీ ఓటు బ్యాంకు మనకు టర్న్ కావాల్సిందే. వైసీపీ ఓటర్లు బీజేపీ వైపు మళ్లాలంటే ఆ పార్టీపై సాఫ్ట్ కార్నర్ ఉంటే కుదరదు. వైసీపీకి ఇచ్చి పడేస్తేనే ఏపీ పొలిటికల్ పిచ్‌లో సెట్ అయిపోవచ్చు.ఇప్పుడిదే ప్లాన్‌తో ఉందట బీజేపీ. మొన్నటి దాక పొత్తులు..మద్దతు అంటూ ఊగిసలాడిన కమలనాథులు నవ్యాంధ్రలో బలపడడానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట. వైసీపీ అపోజిషన్‌లో ఉన్నప్పుడే ఆ పార్టీని మరింత వీక్ చేస్తే..టీడీపీకి షిఫ్ట్ కాని వైసీపీ ఓటర్లంతా తమకు వైపు మళ్లుతారని లెక్కలు వేసుకుంటున్నారట. ఈ పొలిటికల్ గేమ్‌తోనే ఏపీ సెంట్రిక్‌గా పెద్ద గేమ్ స్టార్ట్ చేసిందట బీజేపీ.వైసీపీని బీజేపీ రాజకీయంగా దూరంగానే పెడుతోంది. 2024 ఎన్నికల వేళ కూడా గుంటూరులో జరిగిన సభలో మోదీ వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి ప్రభుత్వం అని నాడు బీజేపీ పెద్దలు అన్నారు. అదే నిజమని ఇప్పుడు మరోసారి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ వేదికగా వైసీపీ మీద తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఈ సారి ఇంకాస్త డోస్ పెంచారనే చెప్పొచ్చు. 2024 ఎన్నికల్లో ఏపీలో అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపారని..వైసీపీది అసమర్థ అస్తవ్యస్తమైన పాలన అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.మోదీ, అమిత్‌షాతో సహా బీజేపీ అగ్రనేతలెవరూ ఇప్పటివరకు ఈ స్థాయిలో వైసీపీని టార్గెట్ చేయలేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో నడ్డా చేసిన కామెంట్స్ ఇప్పుడు కమలం క్యాడర్‌లో జోష్‌ను నింపుతున్నాయి. వైసీపీని ఒక డెత్ ట్రాప్‌గా అభివర్ణించారు నడ్డా.కూటమిగానే ఉంది. కేంద్రంలో టీడీపీ, జనసేన ఎంపీల మద్దతుతోనే అధికారంలో కొనసాగుతోంది బీజేపీ. అయితే ఏపీలో ఒంటరిగా బలపడి డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండాలని..అవసరమైతే సొంతంగా అధికారంలోకి వచ్చేంత స్ట్రాంగ్ కావాలని కలలు కంటోంది కమలం పార్టీ. ఇప్పుడు తమ బలం పెంచుకోవడానికి..కూటమిగానే ఉంటామంటోంది.అలా అని రాజకీయ వ్యూహాల విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదు. కూటమిని డిస్టర్బ్ చేయకుండా..సొంతంగా బలపడాలంటే వైసీపీని టార్గెట్ చేయడం తప్ప మరో మార్గం లేదని డిసైడ్ అయిపోయింది కమలం పార్టీ. వైసీపీకి 40 శాతం ఓటింగ్ ఉంది. ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపునకు తిప్పుకునే స్కెచ్ వేస్తోంది బీజేపీ. అందుకు అనుగుణంగా గతంలో ఏ బీజేపీ జాతీయ నాయకుడు చేయని విధంగా జేపీ నడ్డా వైసీపీని టార్గెట్ చేశారు. ఏకంగా వైసీపీని ఎమ్మెల్సీనే చేర్చుకుని..గత వైసీపీ పాలనపై నడ్డా సహా నేతలంతా తీవ్ర విమర్శలు చేయటం హాట్ టాపిక్‌గా మారింది.ఆ 40 శాతం పొలిటికల్ వాక్యూమ్ మీదే కమలనాథులు ఫోకస్ పెట్టినట్లు క్లియర్ కట్‌గా అర్థమవుతోంది. వైసీపీ విషయంలో సాఫ్ట్ కార్నర్‌తో ఉన్నా.. విమర్శలు చేయకుండా ఉన్నా తమకే నష్టమని భావిస్తున్నారట బీజేపీ నేతలు. భవిష్యత్‌లో వైసీపీ బలపడటం, తిరిగి అధికారంలోకి రావడమన్న సంగతి తర్వాత..ఇప్పుడు ఏపీలో మనం బలపడాలి. అంతకంటే ముందు ఏపీ ప్రజలు మనల్ని నమ్మాలని పెద్ద వ్యూహమే రచిస్తున్నారట. ఇక నుంచి మీటింగ్ ఏదైనా..విషయం మరేదైనా వైసీపీ టార్గెట్‌గా అటాక్ మొదలు పెట్టకపోతే పొలిటికల్‌గా పికప్ అవడం కష్టమని లెక్కలు వేసుకుంటున్నారట.కూటమిలోనే ఉన్నా.. జగన్‌తో బీజేపీ అగ్రనేతలకు సన్నిహిత సంబంధాలున్నాయని ఇన్‌సైడ్ టాక్ నడుస్తుంటుంది. జగన్ మీద బీజేపీ ఏ యాక్షన్ తీసుకోవడం లేదు.. తీసుకోలేదన్న గుసగుసలు ఉన్నాయి.

వీటన్నింటికి చెక్ పెడుతూ ఏపీలో తమ రాజకీయ శత్రువు వైసీపీనే అని బీజేపీ క్లియర్ కట్‌గా చెప్పేస్తోంది. ఆ పార్టీ ఓటు బ్యాంకు టార్గెట్‌గానే ఫ్యూచర్ ప్లాన్స్ ఉంటాయని కమలనాథులు చెప్పకనే చెప్తున్నారు.ఇప్పటికే ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్..రాయలసీమ నుంచే తన పర్యటనలకు శ్రీకారం చుట్టారు. జగన్ ఇలాకాగా, వైసీపీ కంచుకోటగా పేరున్న రాయలసీమలో ఆ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక తెస్తే వైసీపీ వీక్ అయి తమకు కలిసి వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.

వైసీపీ ఓటు బ్యాంకును తమవైపునకు టర్న్ చేసుకోవాలని బీజేపీ వేస్తున్న ఎత్తులు వర్కౌట్ అవుతాయో లేదో చూడాలి మరి.

## ఎల్ఐసీ ఆఫీసులో అగ్నిప్రమాదం

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మేడ్చల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎల్ఐసీ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా భవనం మొత్తం మంటలు, పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను కంట్రోల్ చేశారు.

# గంటా అవకాశం కోసం ఎదురుచూపులు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 18,గంటా శ్రీనివాస్. కాపు సామాజికవర్గానికి చెందిన నేత. ఏపీ పాలిటిక్స్‌లో ఆయన రూటే సెపరేటు. గెలిచిన చోటు నుంచి తిరిగి పోటీ చేయకపోవడం ఆయన ప్రత్యేకత. అయితే అందుకు భిన్నంగా భీమిలి నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు గంటా. ఇప్పటివరకు ఓటమి ఎరుగని నేతగా పేరున్న ఆయన గతంలో మంత్రిగా కూడా పనిచేశారు. కాకపోతే ఇప్పుడు అధికార పార్టీలో ఉండి కూడా సొంత నియోజకవర్గానికే పరిమితయ్యే పరిస్థితి ఉందట. ఇప్పుడు మళ్లీ మంత్రి కావాల్సిన జాతకం అయితే..బొమ్మ తిరగబడినట్లు అయిందట పరిస్థితి. అయితే టీడీపీ అధిష్టానంతో గంటాకు టర్మ్స్ అంత బాలేవట. అందుకే మొన్నటి ఎన్నికల ముందు అయితే భీమిలీ టికెట్ కోసం ఆయన తీవ్ర ప్రయత్నాలే చేశారట.

టీడీపీ అధిష్టానం ఆయనకు నో కాన్ఫిడెన్స్ బోర్డు పెట్టేసిందని, ఇప్పట్లో దాన్ని మార్చే పరిస్థితులు కూడా కనిపించడం లేదని చెప్పుకుంటున్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, గంటా మధ్య దూరం బహిరంగ రహస్యం. ఇటీవల భీమిలి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఇద్దరు కార్పొరేటర్లు గళం విప్పితే మందలించాల్సిన జిల్లా నాయకత్వం దానికి విస్తృతమైన ప్రచారం కల్పించడంతో పాటు హైకమాండ్ వరకు మోసిందట.ఇక విశాఖ నుంచి విజయవాడకు విమాన సర్వీసులు కుదించడంపై గంటా పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ చర్చకు దారి తీసింది. హైకమాండ్ ఆయన తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. ఇలాంటివన్నీ పార్టీ పెద్దలతో ఆయనకు గ్యాప్ పెంచడానికి రీజన్స్‌గా మారాయట. అయితే ఇదంతా ఇప్పటికిప్పుడు వచ్చింది కాదని, బ్యాక్‌గ్రౌండ్ కూడా గట్టిగానే ఉందంటున్నారు.2014-19 మధ్య చంద్రబాబు క్యాబినెట్‌లో ఊఖీఆ మంత్రిగా పనిచేశారు గంటా. అప్పట్లో పార్టీ సీనియర్ నేత, ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో వర్గ పోరు నడిచింది. విశాఖ భూకుంభకోణం సహా అనేక అంశాలపై అయ్యన్న, గంటాల మధ్య వార్ పీక్స్‌లో నడిచింది. అధినాయకత్వంతో విభేదించడం, అలకపూనడం వంటి చర్యలు గంటా మీద చంద్రబాబుకు ఒక అభిప్రాయం ఏర్పడటానికి కారణం అయ్యాయంటున్నారు.ఇక 2019లో టీడీపీ ఓడిపోయినా విశాఖ జిల్లాలో మాత్రం నాలుగు సీట్లు గెలుచుకుంది. వీటిలో గంటా విజయం సాధించిన విశాఖ నార్త్ ఒకటి. అప్పట్లో గంటా శ్రీనివాస్ తమను లైట్ తీసుకున్నారన్న అభిప్రాయం టీడీపీ పెద్దల్లో బలంగా ఉందట. అందుకు తగ్గట్టే అధినేత కార్యక్రమాలకు దూరంగా ఉండేవారాయన. హైకమాండ్ ఫోన్లకు అందుబాటులో లేకపోవడం, నియోజకవర్గ బాధ్యతలు ఇంచార్జ్ చేతుల్లో పెట్టేయడం వంటివి టీడీపీ పెద్దల దృష్టిలో ఆయన పలుచన కావడానికి కారణం అయ్యాయట.అదే సమయంలో గంటా వైసీపీకి దగ్గరవుతున్నారని, ఫ్యాన్ పార్టీ గూటికి చేరేందుకు ముహూర్తం కూడా పెట్టేసుకున్నారంటూ అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ వార్తలను గంటా ఖండించకపోవడంలో కూడా టీడీపీ పెద్దలకు నచ్చలేదట. అంతేకాదు రుషికొండ వివాదం, చంద్రబాబు అరెస్ట్, లోకేశ్ పర్యటనల్లో జరిగిన వివాదంపై కూడా గంటా రియాక్ట్ కాలేదు. ఈ అంశాలే ఆయనకు టీడీపీ పెద్దలతో గ్యాప్‌కు దారి తీశాయట. దీంతో పొలిటికల్ ప్లాన్స్ వేయడంలో దిట్ట అయిన గంటా ఇప్పుడు స్టైల్ మార్చారట. తొందరగానే తత్వాన్ని గ్రహించి..ఇప్పుడు చంద్రబాబు, లోకేష్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారట. వైసీపీపై ఘాటు విమర్శలు చేస్తూ చంద్రబాబు దృష్టిలో పడేందుకు తాపత్రయ పడుతున్నారట గంటా.గతంలో పార్టీ పెద్దలు జిల్లాకు వస్తే కూడా లైట్ తీసుకున్న గంటా ఇప్పుడు ఎదురెళ్లి మరీ స్వాగతం పలికే వరకు వచ్చిందట వ్యవహారం. ఈ మధ్య లోకేశ్ తరచూ విశాఖలో పర్యటిస్తున్నారు. గతానికి భిన్నంగా గంటా శ్రీనివాస్ ఎయిర్ పోర్టుకు వెళ్లి మరీ స్వాగతం పలుకుతుండటాన్ని చూసి సొంత పార్టీ నేతలే అవాక్కవుతున్నారట. తాజాగా రెండు రోజుల పర్యటన కోసం విశాఖకు వచ్చిన లోకేశ్‌తో కలిసి ఒకే వేదికను పంచుకున్నారు గంటా. భీమిలి నియోజకవర్గంలోని ఓ స్కూల్స్‌లో ఏఐ ల్యాబ్స్‌ను ప్రారంభించడం కొంత సానుకూలతగా భావిస్తున్నారు.ఇక ఒకే పార్టీలో ఉన్నా ఇన్నాళ్లు ఉప్పునిప్పులా కనిపించిన అయ్యన్న, గంటాలు ఈ మధ్యే యాదృచ్ఛికంగా కలిశారు. ఓ ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో స్పీకర్‌తో మర్యాదపూర్వక కరచాలనం చేశారు గంటా.

ఇవన్నీ ఒక్కొక్కటిగా పేర్చుకుని చూసుకుంటే మాజీ మంత్రికి ఆలస్యంగా తత్వం బోధపడినట్టే కనిపిస్తోందంటున్నారు రాజకీయ పరిశీలకులు.త్వరలో క్యాబినెట్ విస్తరణ జరిగితే చోటు దక్కించుకునే ప్లాన్‌తో పాటు..వచ్చే ఎన్నికల నాటికి తన కుమారుడు రవితేజ కోసం ఇప్పటి నుంచే ప్లాట్ ఫామ్ రెడీ చేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు గంటా. ఇప్పటికే భీమిలి పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు సన్నాఫ్ గంటా. అలా మెల్లిగా రవితేజను లోకేశ్ టీమ్‌లో చేర్చగలిగితే..ఇక సమస్య ఉండబోదన్నది భీమిలి ఎమ్మెల్యే వ్యూహంగా ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా ఆయనలో వచ్చిన ఈ మార్పుపై మాత్రం పార్టీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

# అమాత్య కోసం అయ్యన్న చూపులు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 18, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న డిమాండ్ పార్టీ నేతల నుంచి ఎక్కువగా వినిపిస్తుంది. శాసనసభ స్పీకర్ గా ఆయన మంచి పదవిలోనే ఉన్నారు. అయితే స్పీకర్ పదవిలో కంటే అయ్యన్నపాత్రుడు మంత్రిపదవిలో ఉంటేనే పార్టీకి మంచిదన్న అభిప్రాయాలు తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా నుంచి టీడీపీ నాయకత్వానికి ఎక్కువగా అందుతున్నాయి. తెలుగుదేశ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినప్పటికీ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అదీ విశాఖ ప్రాంతం కోటా కింద ఖచ్చితంగా అయ్యన్నపాత్రుడికి మంత్రి పదవి దక్కుతుంది. కానీ ఈసారి సీనియర్ నేతలకు అవకాశం దక్కకపోవడంతో అయ్యన్నను అవమానించడం ఇష్టలేని నాయకత్వం శాసనసభ స్పీకర్ గా ఎంపిక చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పదిహేను నెలలు గడుస్తున్నప్పటికీ మంత్రులు పనితీరు సరిగా లేదని అధినాయకత్వం కూడా భావిస్తుంది. మంత్రి వర్గ సమావేశాల సందర్భంగా ప్రతి సారీ చంద్రబాబు నాయుడు మంత్రులను హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అయ్యన్నపాత్రుడు లాంటి వారికి మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఊపందుకుంది. 2019 నుంచి 2024 వరకూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సమయంలోనూ అయ్యన్నపాత్రుడు యాక్టివ్ గా ఉన్నారు. నాటి వైసీపీ అధినేత వైఎస్ జగన్ పైనా, ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేసేవారు. అందుకే అయన్న పాత్రుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీడీపీ క్యాడర్ కు బాగా దగ్గరయ్యారు. ఆయన కేసులను కూడా ఎదుర్కొన్నారు. . ప్రస్తుతం టీడీపీ మంత్రులు విపక్ష వైసీపీ చేస్తున్న విమర్శలకు ధాటిగా సమాధానం ఇవ్వడం లేదన్న అభిప్రాయం ఇటు పార్టీ నాయకత్వంలోనూ, అటు క్యాడర్ లోనూ ఉంది. సీనియర్ నేతలైనా పార్టీకి ప్రయోజనకరంగా ఉండే, కటువుగా విమర్శలకు కౌంటర్ చేసే వారిని కేబినెట్ లోకి తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆయనకు ఉన్న అనుభవం కూడా ఉపయోగపడుతుందని అంటున్నారు. స్పీకర్ గా ఉండి కూడా కొన్ని విషయాల్లో కఠినంగా ఉంటూ హార్ష్ కామెంట్స్ చేస్తున్న అయ్యన్న పాత్రుడికి తెలుగుదేశం పార్టీలోని క్యాడర్ నుంచి విపరీతంగా మద్దతు పెరుగుతుంది. అయితే మంత్రి వర్గంలోకి తీసుకోవడమా? లేదా? అన్న నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది కావడంతో ఆయనకే ఈ వినతిని చేస్తున్నారు. మరి చంద్రబాబు నిర్ణయం ఎలా ఉంటుదన్నది చూడాలి.

# కన్నీరు తెప్పిస్తున్న రొయ్యలు

ఏలూరు, సెప్టెంబర్ 18,ఇన్నాళ్లు కాసుల వర్షం కురిపించిన రొయ్యల పెంపకం నేడు కన్నీరు తెప్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో రొయ్యల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంతో పాటు మరొక వైపు రొయ్యల పెంపకం ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలకు మాత్రం వారి సమస్యలు పట్టడం లేదు. ఎగుమతులు ప్రస్తుతం పెద్ద సమస్యను ఎదుర్కొంటున్నాయి. అమెరికా, యూరప్ దేశాలు రొయ్యలపై ఎక్కువ పన్నులు వేసేయడంతో చాలా ఆర్డర్లు రద్దయిపోయాయి. ఈ కారణంగా రాష్ట్రానికి దాదాపు ఇరవై ఐదు కోట్ల రూపాయల మేరకు నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.రొయ్యల పెంపకంలో వినియోగించే ఫీడ్, వినియోగించే మందులు, విద్యుత్తు ఛార్జీలతో ఖర్చు తడిసి మోపెడవుతుంది. తీరా రొయ్యల పంట చేతికి వచ్చేసరికి గిట్టుబాటు ధర లభించడం లేదు. గత కొన్ని రోజులుగా ఎగుమతులు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి అయ్యే రొయ్యలకు విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉండేది. కానీ అన్ని దేశాలు రొయ్యల ఎగుమతులపై పన్నులు పెంచడంతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశీయ మార్కెట్ లో రొయ్యలను విక్రయిస్తుండటంతో ధరలు కిందకు పడిపోయాయి.రొయ్యలు ధరలు భారీగా పడిపోవడంతో పెట్టుబడులు తిరిగి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో రొయ్య పిల్లలను సరఫరా చేసే హాచరీస్, ప్రాసెసింగ్ యూనిట్లు కూడా తమ ఉత్పత్తులను తగ్గించుకున్నాయి. రొయ్యల కు డిమాండ్ తగ్గిపోవడంతో ఆ ప్రభావం రవాణా, పోర్టు వంటి వాటిపై కూడా పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని, రొయ్యలకు సరైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని, ఫీడ్, మందులు సబ్సిడీ ప్రాతిపదికన అందించాలని కోరుతున్నారు.

## అవినాష్ రెడ్డికి ఉచ్చు..

కడప, సెప్టెంబర్ 18, వివేకానంద కేసు కొత్త మలుపు తిరుగుతోందా? ఈ కేసు దర్యాప్తు మళ్లీ మొదటికి వస్తుందా? అవినాష్‌రెడ్డికి కష్టాలు పొంచి ఉన్నాయా? సుప్రీంకోర్టు తీర్పుతో సునీత మళ్లీ పిటిషన్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధమైంది. కింది కోర్టు టైమ్ బాండ్ విధించి ఈసారి విచారణకు ఆదేశిస్తుందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు మళ్లీ మొదటికి వచ్చినట్టు కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సునీత రెండు వారాల్లో పూర్తి వివరాలతో సీబీఐ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఆమె పిటిషన్ దాఖలు చేసిన 8 వారాల్లోపు ట్రయల్ కోర్టు తన నిర్ణయాన్ని వెల్లడించనుంది. సునీత ప్రస్తావించబోయే అంశాలు బట్టి మళ్లీ సీబీఐ దర్యాప్తు కొనసాగించాలా? లేదా అనేది ఆధారపడి ఉంటుంది. ఒకవేళ న్యాయస్థానం సీబీఐ విచారణకు ఆదేశిస్తే అవినాష్‌రెడ్డి ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ఈసారి అరెస్టు నుంచి ఆయన్ని ఎవరూ కాపాడలేరని అంటున్నారు. సునీత బాధిత కుటుంబం కావడంతో ఆమెకు అనుకూలంగా తీర్పు రావచ్చని సునీత మద్దతుదారుల మాట. వివేకానంద కేసులో మళ్లీ సీబీఐ దర్యాప్తు అవసరమా? లేదా అన్నదానిపై క్లారిటీ ఇచ్చారు. మంగళవారం సుప్రీంకోర్టులో సీబీఐ వివరణ ఇచ్చింది. న్యాయస్థానం ఆదేశిస్తే విచారణ చేసేందుకు తాము సిద్ధమేనని తెలిపింది. సునీత పిటిషన్‌పై మెరిట్స్ ఆధారంగా విచారించి నిర్ణయాన్ని వెల్లడిస్తామని పేర్కొంది న్యాయస్థానం. ఈ క్రమంలో సునీత తరపు న్యాయవాది సిద్ధార్థలుథ్రా తన వాదనలు వినిపించారు. న్యాయస్థానానికి అందజేశారు. నిందితులకు బెయిల్ రద్దుతోపాటు మళ్లీ దర్యాప్తు కోరుతున్నట్లు అడ్వకేట్ వివరించారు. ఈ క్రమంలో సునీత లాయర్‌కు న్యాయమూర్తి పలు ప్రశ్నలు సంధించారు. మీ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు ముందుకు సాగదన్నారు. ట్రయల్ పూర్తి కావడానికి దశాబ్దం పడుతుందని వ్యాఖ్యానించారు.

# గ్రేట్ నికోబార్ రచ్చ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, (న్యూస్ పల్స్) భారతదేశం ఇండో?పసిఫిక్ ప్రాంతంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి గ్రేట్ నికోబార్ దీవిలో రూ.72 వేల కోట్లతో భారీ ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రణాళిక దేశ ఆర్థిక, రక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా, చైనా విస్తరణకు చెక్ పెట్టే వ్యూహం అని కేంద్రం చెబుతోంది. అయితే, ప్రతిపక్షాలు, పర్యావరణవాదులు దీన్ని ఆదివాసీ సంస్కృతులకు, జీవవైవిధ్యానికి ముప్పుగా చూస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత తాజాగా రాసిన ఆర్టికల్‌తో ఈ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.2021లో ప్రారంభమైన ఈ ప్రణాళిక, నిత్థి ఆయోగ్ 2022లో ఆమోదించింది. అండమాన్ ? నికోబార్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏఎన్ఐఐడీసీవో) ద్వారా అమలు చేస్తున్న దీని ప్రధాన భాగాలు ఇంటర్నేషనల్ కంటైనర్ ట్రాన్షిప్‌మెంట్ టెర్మినల్ (ఐసీటీటీ), అంతర్జాతీయ విమానాశ్రయం, 450 మెగావాట్ గ్యాస్ ? సోలార్ ఎనర్జీ ప్లాంట్, 16 వేల హెక్టార్లలో మెగా టౌన్‌షిప్. గలతీ బేలో జనాభా తక్కువగా ఉన్న ప్రదేశంలో ఐసీటీటీ నిర్మాణం, 2050 నాటికి 6.5 లక్షల మంది నివాసం ఉంటారని ప్రభుత్వం చెబుతోంది. ఇది హాంకాంగ్ మోడల్‌పై ఆధారపడి, కొలంబో, పోర్ట్ క్లాంగ్‌లతో సమాన దూరంలో ఉండటం వల్ల వాణిజ్యానికి అనుకూలం. 2027?28 నాటికి మొదటి దశ పూర్తి చేయాలని లక్ష్యం, 2025 జూలైలో ఎన్‌జీటీకి నివేదిక సమర్పించారు.గ్రేట్ నికోబార్ మలాక్కా స్ట్రెయిట్ ప్రవేశ ద్వారానికి సమీపంలో (సిక్స్ డిగ్రీ చానల్), ప్రపంచ వాణిజ్యంలో 30?40% రవాణా జరిగే ప్రాంతం. చైనా 80% చమురు దిగుమతులు ఇక్కడి ద్వారా జరుగుతాయి, బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో ప్రభావం పెంచుకోవడానికి 'స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్' వ్యూహంలో భాగంగా హమ్బంటోటా (శ్రీలంక), చిట్టాగాంగ్ (బంగ్లాదేశ్), క్యాక్యుయుక్?వ్యూ (మయన్మార్), కోకో ఐలాండ్స్‌లో మిలిటరీ స్థావరాలు నిర్మిస్తోంది. ఇండోనేషియాలో సుందా, లాంబోక్ స్ట్రెయిట్‌ల సమీపంలో చైనా నౌకాస్థావరాలు ఏర్పాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో, గ్రేట్ నికోబార్‌లో డీప్ సీపోర్ట్, డ్యూయల్?యూజ్ విమానాశ్రయం (సివిల్?డిఫెన్స్) నిర్మించడం భారత్‌కు మలాక్కా సందిపై పట్టు దొరుకుతుంది. విశాఖపట్నం ఏకైక తూర్పు నావల్ బేస్‌పై ఒత్తిడి తగ్గుతుంది, ఫిజీ, జపాన్‌తో కనెక్టివిటీ పెరుగుతుంది. 'నెక్లెస్ ఆఫ్ డైమండ్స్'గా అండమాన్?నికోబార్‌ను చూస్తూ, ఈ ప్రాజెక్టు భారత్ 'ఆక్ట్ ఈస్ట్' పాలసీ, ఏజీఏఆర్ డాక్ట్రిన్‌కు బలం. ఇప్పటికే బాజ్ నావల్ ఎయిర్ స్టేషన్ ఉంది, ఇది చైనా ప్రభావానికి ప్రతివ్యూహంగా పనిచేస్తుంది.900 చదరపు కి.మీ. విస్తీర్ణంలో రెండు జాతీయ పార్కులు (క్యాంప్‌బెల్ బే, గలతీ) ఉన్న దీవి, 800కి పైగా వృక్ష జాతులు, నికోబార్ మెగాపోడ్ పక్షి, లెదర్‌బ్యాక్ తాబేళ్లు, మొసళ్లు ఇక్కడ జీవిస్తాయి. ప్రాజెక్టు 15% అడవులను(8.5 లక్షల నుంచి 58 లక్షల వృక్షాలు) నరికితే, కోరల్ రీఫ్‌లు, మెరైన్ ఎకోసిస్టమ్ దెబ్బతింటాయి. డ్రిల్లింగ్, ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాన్ని దెబ్బతీస్తాయి, పక్షులు, జంతువుల వలసలు ఆటంకపడతాయి. షాంపెన్ (పీవీజీటీ, 200?300 మంది), నికోబారీస్ తెగలు (1,761 మంది) జీవనోపాధి అడవులపై ఆధారపడి ఉంది. 2004 భూకంపం తర్వాత నికోబారీస్ గ్రామాలు కూలిపోయి, తిరిగి స్థిరపడాలని ఆశలు పెట్టుకున్నారు, కానీ ప్రాజెక్టు భూములు ఆ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ (ఎఫ్ఆర్ఏ) 2006, ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్ 2013 ఉల్లంఘన అవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎస్ఐఏ)లో తెగలు పాల్గొనలేదు. ట్రైబల్ కౌన్సిల్ రద్దు చేసింది. సీస్మిక్ జోన్‌లో ఉండటం వల్ల భవిష్యత్ విపత్తులకు దీని రూపం మారవచ్చు.ఈ ప్రాజెక్టు భారత్‌కు వాణిజ్య హబ్‌గా, రక్షణ బలంగా మారవచ్చు, సింగపూర్, కొలంబో పోర్టులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. చైనా 'స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్'కు ప్రతిస్పందనగా ఇది ఇండో?పసిఫిక్‌లో క్వాడ్ (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) లక్ష్యాలకు సహాయపడుతుంది. అయితే, పీవీటీజీల జీవన విధానం, ఏకైక జీవవైవిధ్యం కాపాడాలి. ప్రభుత్వం ట్రైబల్ ఇన్‌పుట్ తీసుకుంటే, గ్రీన్ టెక్నాలజీ (సోలార్, ఎకో?ఫ్రెండ్లీ పోర్ట్) అమలు చేస్తే సమతుల్యత సాధ్యం.

# కోమటిరెడ్డి ఆగని దూకుడు

నల్గోండ, సెప్టెంబర్ 18, మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దూకుడు ఆగేటట్లు కనిపించడం లేదు. ఆయన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నప్పటికీ పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. చూసీ చూడనట్లు, వినీ విననట్లు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం వ్యవహరిస్తుండటంతో ఆయన మరింతగా పార్టీకి తలనొప్పిగా తయారయ్యారన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్న మాట. మంత్రివర్గంలో స్థానం దక్కే అవకాశం లేదని తెలిసినప్పటి నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీని డ్యామేజీ చేస్తూ పలు రకమైన వ్యాఖ్యలు చేశారు. అయినా సరే పార్టీ క్రమశిక్షణ సంఘం కానీ, పీసీసీ కాని ఏమీ వినపడనట్లు మాత్రమే వ్యవహరిస్తుంది.చిన్నా చితకా నేతలతో పాటు కొందరి ముఖ్యమైన నేతలకు నోటీసులు ఇచ్చే క్రమశిక్షణ సంఘం తమకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పడం విడ్డూరంగా అనిపిస్తుంది. పత్రికల్లో పతాక శీర్షికల్లోనూ, సోషల్ మీడియాలోనూ అవి కనిపిస్తున్నప్పటికీ తమకు తెలియదని క్రమశిక్షణ సంఘం బుకాయిస్తుందని పార్టీ నేతలే చెబుతున్నారు. ఇక మరొకవైపు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా తమకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, క్రమశిక్షణ సంఘం దృష్టికి వస్తే దానిని పరిశీలించవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో ఎవరికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీపైన, ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి పైన వ్యతిరేకంగా చేసే వ్యాఖ్యలను మాత్రం పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతుంది.తాజాగా కోమటిరెడ్డి మరోసారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యానించారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లడుతూ నిరుద్యోగ యువత ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేయడం సహేతుకమైనదేనని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మ్యానిఫేస్టో లో చెప్పిన దానిని అనుసరించి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అంతేకాదు..గ్రూప్ 1 అవకతవకలపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానిని కూడా అన్నారు. దీంతో టీజీపీఎస్సీసీ అవకతవకలు జరగలేదని చెబుతుంటే, ప్రభుత్వంలోని పెద్దలు కూడా పరీక్షలు సజావుగాజరిగాయని చెబుతున్న నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు మరోసారి కాక పుట్టిస్తున్నాయి. కానీ కాంగ్రెస్ హైకమాండ్ మాత్రం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఈసారి కూడా ఉండకపోవచ్చు.

# కవితతో భేటీ నేరమేనా



హైదరాబాద్ సెప్టెంబర్ 18, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత వ్యవహారం బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన కలిగిస్తోందన్న చర్చ జరుగుతోంది. తండ్రి కేసీఆర్కు రాసిన లేఖ లీక్..తర్వాత పరిణామాలతో కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఇక సొంతంగా రాజకీయం చేయాలని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే ఆమె జాగృతి పేరుతో యాక్టివిటీని స్పీడప్ చేసేందుకు ప్లాన్చేసుకుంటున్నారు.త్వరలోనే తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చి..వచ్చే ఎన్నికల నాటికి గ్రౌండ్లోకి దిగాలని కవిత భావిస్తున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్తో పాటు ఇతర పార్టీల నేతలను, తెలంగాణ ఉద్యమంలో పని చేసిన పరువురు ప్రముఖులను జాగృతిలోకి ఆహ్వానిస్తున్నారట కవిత. అయితే కవిత ఆహ్వానానికి పెద్దగా స్పందన రావడం లేదని తెలుస్తోంది. కవితను ఎవరు ఏ పనిమీద కలిసినా వాళ్లు తెలంగాణ జాగృతిలో చేరిపోయేందుకే కవితను కలిశారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఏదైనా కార్యక్రమానికి ఇన్వైట్ చేయడానికైనా..లేదా ఏదో అంశం మీద చర్చించడానికి అయినా సరే కవితను కలిస్తే చాలు.. వాళ్లు జాగృతిలో చేరిపోతున్నారనో..లేదంటే త్వరలోనే చేరబోతున్నారనో టాక్ బయలుదెరుతోంది. తాజాగా జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పి.విష్ణువర్ధన్ రెడ్డి విషయమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కవితను ఆహ్వానించేందుకు విష్ణువర్ధన్ రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి కలిశారు. శరన్నవరాత్రుల కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. అయితే విష్ణువర్ధన్ రెడ్డి కవిత నివాసానికి అలా వెళ్లాడో లేదో..ఇలా మీడియాలో సోషల్ మీడియాలో విష్ణువర్ధన్ రెడ్డి తెలంగాణ జాగృతిలో చేరిపోతున్నారని, త్వరలో జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆయన జాగృతి తరపున పోటీ చేయబోతున్నట్లు ప్రచారం మొదలైంది.ఇది బీఆర్ఎస్ పార్టీకి పెద్ద షాక్ అంటూ ఓ సెక్షన్ వార్తను స్ప్రెడ్ చేసేసింది. తాను కవిత నివాసం నుంచి బయటకు రాగానే ఈ విషయం తెలుసుకున్న విష్ణువర్ధన్ రెడ్డి నిజంగానే షాక్ తిన్నారట. అక్కడి నుంచి నేరుగా తెలంగాణ భవన్కు చేరుకున్న విష్ణువర్ధన్ రెడ్డి..తాను బీఆర్ఎస్ను వదిలే ప్రసక్తే లేదని, కేటీఆర్ వెంటే తన ప్రయాణం అని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.విష్ణువర్ధన్ రెడ్డికే కాదు.. బీఆర్ఎస్ నాయకులు, ఇతర ముఖ్యుల విషయంలోనూ ఇలానే జరిగిందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎవరు ఏ పనిమీద కవితను కలవడానికి వెళ్లినా..వెంటనే వాళ్లు తెలంగాణ జాగృతిలో చేరిపోతున్నారనే ప్రచారం జరగడం నేతలకు కోపం తెప్పిస్తోందట. ఈ ప్రచారం చేస్తున్నదెవరు.? కవిత టీమే లీకులిచ్చి మరీ వార్తలు వచ్చేలా చేస్తోందా.?లేదా ఇంకెవరైనా బీఆర్ ఎస్ పార్టీలో కన్ఫ్యూజన్ క్రియేట్ చేయడానికి ఇలా ప్లాన్ చేస్తున్నారా అని ఆరా తీస్తున్నారట లీడర్లు. కవితను అలా కలిశారో లేదో ఇలా.. మీడియాకు, సోషల్ మీడియాలో న్యూస్ రావడం చూసి షాక్ అవుతున్నారట. దీంతో ఇప్పుడు కవిత ఇంటికి కాదు..ఆ దరిదాపుల్లోకి వెళ్లడానికే జంకుతున్నారట బీఆర్ఎస్ నేతలు. కవిత అంశం ఎక్కడైనా చర్చకు వచ్చినా సైలెంట్‌గా ఉండిపోతున్నారే తప్ప ఎందుకొచ్చిన గొడవని ఎవ్వరు పెద్దగా స్పందించడం లేదట.

# శనిశ్వర విగ్రహంపై రాజకీయం

తిరుపతి, సెప్టెంబర్ 18, తిరుపతిలో అసంపూర్తిగా ఉన్న శనీశ్వర విగ్రహంపై రెండు దశాబ్దాల తర్వాత అకస్మాత్తుగా రాజకీయ దుమారం చెలరేగింది. ఇది విష్ణుమూర్తి విగ్రహమంటూ మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ ధర్మానికి తూట్లు పొడుస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నిన్న తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాల సమీపాన ఉన్న ఓ విగ్రహం పాదపీఠికకు మొక్కి భూమన కళ్లకద్దుకున్నారు. కోనేటిరాయుడా ఏమిటీ నీకీ దుస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విష్ణుమూర్తి విగ్రహాన్ని పడేసి, అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారని, మద్యం తాగుతున్నారని ఆయన ఆరోపించారు. హిందూ సంఘాలన్నీ ఏకమై ఈ అపచారాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో వైరల్ అయింది. భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలపై టీడీపీ నేతలు వెంటనే స్పందించారు. ఆ విగ్రహం విష్ణుమూర్తిది కాదని, అది అభయ శనేశ్వర విగ్రహమని వారు రుజువు చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఆ విగ్రహం అక్కడే ఉందని స్పష్టం చేస్తూ.. రాజకీయ ప్రయోజనాల కోసం భూమన ఇలాంటి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే భూమన టార్గెట్ అని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన భూమనకు ఈ విషయం తెలియదా అంటూ వారు ప్రశ్నించారు. ఈ వివాదంపై తిరుమలలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై క్రిమినల్ కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. ఇకపై టీటీడీ, శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ తీవ్రంగా హెచ్చరించారు. టీటీడీపై దుష్ప్రచారం చేస్తూ.. హిందువుల మనోభావాలను దేభతెస్తున్నారంటూ టీటీడీ డీఈఈ గోవిందరాజులు భూమన?పై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించి సమాజంలో అల్లకల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విష్ణుమూర్తి విగ్రహంపై అసత్యాలు మాట్లాడారని, విష్ణుమూర్తి విగ్రహానికి అపచారం జరిగిందంటూ.. భూమన వ్యాఖ్యలతో శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నాయన్నారు. అలిపిరి పోలీస్ స్టేషన్లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ వివాదం నడుస్తుండగా ఆ విగ్రహాన్ని చెక్కిన శిల్పి కన్నయ్యచారి కుమారుడు గురుస్వామి మీడియా ముందుకు వచ్చారు. 22 ఏళ్ల క్రితం బెంగళూరుకు చెందిన వ్యక్తి 2 లక్షలు ఇచ్చి, పది చేతులు, సింహంతో కూడిన శనీశ్వరుడి విగ్రహం చేయమని తమని కోరారని, ఆ వ్యక్తి చనిపోవడంతో ఆ విగ్రహం అక్కడే ఉండిపోయిందని గురుస్వామి వివరణ ఇచ్చారు.

# ఈవీఎంలలో అభ్యర్థుల కలర్ ఫోటోలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, (న్యూస్ పల్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు)పై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈవీఎంలపై ఇప్పటి వరకూ పార్టీ గుర్తులు మాత్రమే ఉండేవి. ఇక, గుర్తులతో పాటు పోటీచేసే అభ్యర్థుల కలర్ ఫోటోలను కూడా ఉంచనున్నట్లు తెలిపింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈవీఎం బ్యాలెట్లపై కలర్ ఫోటోలను ముద్రించడం వల్ల ఓటర్లకు మరింత స్పష్టం వస్తుందని పేర్కొంది. ఈ కొత్త నిబంధనలు త్వరలోనే జరగనున్న బిహార్ శాసనసభ ఎన్నికల నుంచే అమల్లోకి వస్తాయని తెలిపింది.ఈసీ ప్రకారం.. ఓటర్లకు స్పష్టంగా కనిపించేలా ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫోటోను ఉంచనున్నారు. 'ఎన్నికల ప్రక్రియలను మరింత సులభతరం, పారదర్శకం కోసం, ఓటర్ల సౌలభ్యాన్ని మరింత పెంచడానికి గత 6 నెలల్లో తీసుకున్న 28 సంస్కరణల సరసన ఇది నిలుస్తుంది' అని ఈసీ తన ప్రకటనలో వెల్లడించింది.ఈవీఎంలపై పోటీచేసే అభ్యర్థుల సీరియల్ నెంబర్లు, పేర్లు ఒకే రకమైన ఫాంట్ టైప్‌లో, పెద్ద అక్షరాలలో ముద్రించనున్నారు. తద్వారా ఓటర్లు సులభంగా చదవగలిగేలా ఉంటుంది. అలాగే, ఈవీఎం బ్యాలెట్ 70 జీఎస్ఎం పేపర్‌పై ముద్రించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం పింక్ కలర్ పేపర్, ఈ అప్‌గ్రేడ్ చేసిన బ్యాలెట్ పేపర్లు బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో మొదలవుతుందని ఈసీ స్పష్టం చేసిందికాగా, ఈవీఎంలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తున్నారని, బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏకంగా మీడియా సమావేశం ఏర్పాటుచేసి.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అంతేకాదు, బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని, పలు రాష్ట్రాల ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనేది విపక్షాల వాదన. దీనిపై రాహుల్ గాంధీ బిహార్‌లో 'ఓటు చోరీ యాత్ర' చేపట్టిన విషయం తెలిసిందే.మరోవైపు, బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై దుమారం రేగుతోంది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చట్టవిరుద్ధమని నిర్ధారణ అయితే.. రద్దుచేస్తామని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఇదే సమయంలో ఓటర్ నమోదుకు ఆధార్ కార్డును కూడా 12వ పత్రంగా తీసుకోవాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. వచ్చే నెల 7న ఈ అంశంపై చివర విచారణ జరిపి, కేసును ముగిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ అంశంపై తాము ఇచ్చే తీర్పు దేశం మొత్తానికి వర్తిస్తుందని తేల్చిచెప్పింది.

# అంబేద్కర్... కరెప్షన్ కింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 18,వీడు మామూలోడు కాదు, మాయలోడు. పేరు అంబేద్కర్, వృత్తి ప్రభుత్వ కొలువు, సైడ్ ప్రొఫెషన్ మాత్రం లంచం మింగడం.. విద్యుత్‌శాఖ ఎఈఇ అంబేద్కర్ అవినీతి లీలలు అన్నీ ఇన్నీ కావు.. ఎన్నో.. ఎన్నెన్నో.. నిన్న 11 ప్రాంతాల్లో సోదాలు చేసి అంబేద్కర్‌ను అరెస్టు చేసింది ఏసీబీ. అతడే ఇవాళ న్యూస్‌పేపర్లలో హెడ్‌లైన్ వార్తయ్యాడు. విద్యుత్ శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఈ అవినీతి చక్రవర్తి అక్రమాస్తులు 200 కోట్లకు పైమాటే. శేర్లింగంపల్లిలో ఒక ఫ్లాట్, గచ్చిబౌలిలో ఐదు ఫ్లోర్ల బిల్డింగ్, 10 ఎకరాల్లో కెమికల్ కంపెనీ, 6 రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్లు.. అంబేద్కర్ అక్రమాస్తుల చిట్టా చాలా పెద్దదే ఉంది. రిమాండ్ రిపోర్టులో అంబేద్కర్ అంతులేని అవినీతి చరిత్రను బైటపెట్టింది ఏసీబీ. గతంలో జిహెచ్ఎంసీలో ఏఈగా చేశారు. డిస్కమ్‌లో, పటాన్‌చెరు, కెపిహెచ్‌బీ, గచ్చిబౌలిలో కూడా పనిచేశారు. ఎక్కడ చార్జ్ తీసుకున్న ప్రతీసారీ రీచార్జ్ అయ్యేవాడు. డ్యూటీ ఎక్కితే చాలు పైసావసూలే. మిస్టర్ అంబేద్కర్? కింగ్ ఆఫ్ కరప్షన్ ఎలా అయ్యాడో క్లియర్‌గా చెబుతోంది అతడి రిమాండ్ రిపోర్ట్.

౧౧ బినామీ సతీష్ ఇంట్లో రూ. 2.58 కోట్లు సీజ్ చేశారు. ఒకేసారి ఇంత మొత్తంలో డబ్బు దొరకటం ఏసీబీ చరిత్రలోనే ఫస్ట్‌టైమ్.

౧౧ ప్రభుత్వ అధికారిగా ఉంటూనే కెమికల్ ఫ్యాక్టరీ పెట్టే స్థాయికి ఎదిగారంటే అంబేద్కర్ చేతివాటం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

౧౧ సూర్యాపేటలో అంతార్ కెమికల్స్ పేరుతో రెండేళ్ల కిందట ప్రారంభించిన కంపెనీలో ఈ పెద్దమనిషి డైరెక్టర్‌గా ఉన్నారు.

౧౧ తాను పక్కనే ఉండి బినామీలతోనే పనులు కానిస్తూ, అక్రమంగా సంపాదించిన పైసల్ని పదింతలు చేసుకునేవాడు. బినామీలకు కాంట్రాక్టు పనులు ఇప్పించినట్టు కూడా అభియోగాలున్నాయి.

౧౧ ఐటీ కారిడార్‌లో హైరైజ్ బిల్డింగులు ఎక్కువ. వాటికి విద్యుత్ కనెక్షన్లు కావాలంటే సారువారి చేయి తడపందే పనయ్యేది కాదు.

౧౧ కనెక్షన్ ఇచ్చేందుకు లోడ్ సరిపోదని సాకు చెబుతూ వారి వద్ద నుండి కోట్లలో లంచం తీసుకున్నట్టు రిమాండ్ రిపోర్ట్‌లో తేల్చారు. వట్టినాగులపల్లిలో వివాదాస్పద వెంచర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దని హైకోర్టు ఆదేశించినా ఖాతరు చేయలేదని ఫిర్యాదులున్నాయి.

ప్రభుత్వ అధికారిగా ఉంటూ ప్రైవేట్ కంపెనీలు పెట్టడం, ఊరూరా బినామీల్ని ఏర్పాటు చేసుకుని, వాళ్ల ద్వారా కథ నడిపించడం.. ఇలా రెచ్చిపోయిన అంబేద్కర్ సారు.. అసలు కంటే కొసరుకే ప్రయారిటీలిచ్చి, వందలకోట్లకు పడగలెత్తాడు. ఆ కథ కాస్తా అడ్డం తిరిగి, ఏసీబీకి చిక్కి ఇప్పుడు ఊచలు లెక్క బెడుతున్నాడు. ఏసీబీ కోర్టులో అంబేద్కర్ ను ప్రవేశపెట్టగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కాగా.. దర్యాప్తులో మున్ముందు మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు

# తీన్మార్ పార్టీకి స్పేస్ ఉందా

హైదరాబాద్, సెప్టెంబర్ 18, ఇప్పట్లో తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల మినహా చెప్పుకునే స్థాయిలో ఎలక్షన్స్ లేవు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో కొత్త రాజకీయ పార్టీల ఏర్పాటు అనేది దాదాపు కష్టమనే చెప్పాలి. కానీ తెలంగాణలో ఇప్పుడు ఎన్నికలకు ముందు ఉన్నట్టుగా వాతావరణం ఉంది. పైగా నాయకులు పోటా పోటీగా రాజకీయ పార్టీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ అయిన కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ క్షేత్రాన్ని ఏర్పాటు చేస్తారని వార్తలు వచ్చాయి. అయితే ఇంతవరకు ఆ పార్టీ విషయంలో క్లారిటీ రాలేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన తీన్మార్ మల్లన్న కొత్త రాజకీయ క్షేత్రాన్ని ఏర్పాటు చేస్తానని కొంతకాలంగా అంటున్నారు. చివరికి ఆ మాట నిలబెట్టుకున్నారు.కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన ఆయన కొంతకాలంగా పార్టీ వ్యవహార శైలి పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుల గణన విషయంలో అధికార పార్టీని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఓ సామాజిక వర్గాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆయన వ్యవహార శైలి పట్ల ఆగ్రహం గా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత తీన్మార్ మల్లన్న అనేక రకాలుగా తన రాజకీయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నాలు చేశారు. చివరికి రాజకీయ పార్టీని ప్రకటించారు. దానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీగా పేరు పెట్టారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా తన పార్టీ ఉంటుందని తీన్మార్ మల్లన్న ప్రకటించారు. భారీగా వచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి తాజ్ బంజారా హోటల్లో తన పార్టీ పేరును ప్రకటించారు తీన్మార్ మల్లన్న.తీన్మార్ మల్లన్న రాజకీయ పార్టీ పెట్టడం ఆశ్చర్యం కాకపోయినప్పటికీ.. ఆయన ఎంతవరకు ఈ పార్టీని నడపగలుగుతారు.. ఎంతవరకు నిలబడగలుగుతారు అనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న. ఎందుకంటే తీన్మార్ మల్లన్న రాజకీయ ప్రయాణం స్థిరంగా లేదు. మొదట్లో ఆయన బిజెపిలో చేరారు. ఆ తర్వాత కొద్ది రోజులకే బయటికి వచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందులో కూడా ఇమడ లేకపోయారు. బిజెపిలో చేరే ముందు ఆయన మీద కేసులు ఉండేవి. బిజెపిలో చేరిన తర్వాత బయటికి రాగలిగారు. అలాగని బిజెపిలో కూడా ఆయన స్థిరంగా ఉండలేకపోయారు. కొంతకాలానికే మళ్లీ కాంగ్రెస్లోకి వెళ్లిపోయారు. ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన తన నిరసన స్వరాన్ని వినిపించడం మొదలుపెట్టారు. ఇలా రెండు ప్రధాన పార్టీల నుంచి త్వరగా నే బయటికి వచ్చిన ఆయన కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం ఒక రకంగా సంచలనమే అయినప్పటికీ.. దానిని ఎంతవరకు నిలుపుకుంటారనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

# 21నుంచి బతుకమ్మ సంబరాలు

## 28న అక్కడ గిన్నిస్ రికార్డ్ స్థాయిలో వేడుకలు

హైదరాబాద్ సెప్టెంబర్ 18, బతుకమ్మ సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ వేడుకలను జరపనుంది. ఈ మేరకు కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 21వ తేదీన వరంగల్ జిల్లా వేయి స్తంభాల గుడిలో వేడుకలను ప్రారంభించి.. 30న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ముగింపు వేడుకలు జరపనున్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సంస్కృతి, ప్రకృతి, పర్యాటకంతో మమేకమయ్యేలా వైభవంగా బతుకమ్మ సంబరాలు జరుపుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సంబురాల్లో భాగంగా సాంస్కృతిక కళాసారథుల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. హైదరాబాద్‌లో ఎంపిక చేసిన జంక్షన్లు, టూరిజం హోటళ్లు, రైల్వే, బస్ స్టేషన్లు, ఎయిర్ పోర్టులు, యూనివర్సిటీల్లో బతుకమ్మ ప్రతిమలు నెలకొల్పాలని అధికారులకు మంత్రి సూచించారు.

సంబురాల షెడ్యూల్ ఇలా..

? ఈనెల 21న సాయంత్రం వేయి స్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభం. అదేరోజు ఉదయం హైదరాబాద్ శివారులో మొక్కలు నాటే కార్యక్రమం.

? 22న హైదరాబాద్ శిల్పారామం. మహబూబ్ నగర్ పిల్లలమర్రి వద్ద బతుకమ్మ వేడుకలు.

? 23న నాగార్జున సాగర్ బుద్ధవనం వద్ద.

? 24న జయశంకర్ జిల్లా కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం ఆవరణంలో, కరీంనగర్ ఐటీ సెంటర్లో.

? 25న భద్రాచలం ఆలయం వద్ద, జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో బతుమకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు.

? 25 నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బతుకమ్మ ఆర్ట్ క్యాంప్ ఉంటుంది.

? 26న నిజామాబాద్ అలీసాగర్ రిజర్వాయర్, అదిలాబాద్, మెదక్ జిల్లాల్లో సంబురాలు జరుగుతాయి. అదేరోజు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ఉదయం సైకిల్ ర్యాలీ ఉంటుంది.

? 27వ తేదీ ఉదయం హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద మహిళల బైక్ ర్యాలీ. సాయంత్రం ఐటీ కారిడార్‌లో బతుకమ్మ కార్నివాల్.

? 28వ తేదీన ఎల్బీ స్టేడియంలో 10వేలకుపైగా మహిళలతో గిన్నీస్ రికార్డ్ సాధించేలా బతుకమ్మ వేడుకలు నిర్వహణ. 50 అడుగుల ఎత్తున బతుకమ్మను అలంకరించనున్నారు.

? 29న పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ పోటీలు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో సరస్ ఫెయిర్. అదేవిధంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఆర్‌డబ్ల్యూఏ , హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ ప్రైజస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు, పోటీలు.

? 30న ట్యాంక్‌బండ్ వద్ద గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్. వింటేజ్ కారు ర్యాలీ, బతుకమ్మ లైటింగ్ ఫ్లోట్స్, ఇకెబానా, జపనీయుల ప్రదర్శన నిర్వహిస్తారు. రాత్రికి సెక్రటేరియట్‌పై 3డీ మ్యాప్ లేజర్ షోతో సంబురాలు ముగుస్తాయి

చూడడానికి రెండు కళ్లు చాలవు

ఈ సంవత్సరం హైదరాబాద్‌లో ఎల్బీస్టేడియంలో ఈ నెల 28న 50 అడుగుల బతుకమ్మను ఆవిష్కరించనున్నారు. ప్రపంచంలోనే ఇది అతి ఎత్తైన బతుకమ్మగా రూపొందించనున్నారు. ఈ అద్భుతమైన రంగుల రంగుల పుష్పాలతో నిర్మితమై, కళ, ప్రకృతి అనుసంధానాన్ని ప్రదర్శిస్తుంది. ఈ రచన నిర్మాణంలో సాంప్రదాయ రీతులతో సమన్వయం చేసి, అద్భుతమైన దృశ్యాన్ని సృష్టించారు. ఈ 50 అడుగుల బతుకమ్మ కళాత్మక ల్యాండ్‌మార్క్‌గా, సాంస్కృతిక చిహ్నంగా నిలుస్తుంది. దీని డిజైన్ స్థానిక వృక్షజాతులు, బతుకమ్మ సంప్రదాయాల నుండి స్ఫూర్తి పొందింది. ఇది ఈ ఉత్సవానికి ఒక ప్రత్యేక ఆకర్షణను జోడిస్తుంది. ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమాలు. ఈ భారీ బతుకమ్మ ఆవిష్కరణ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరుగనుంది. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారుల సంగీత, నృత్య ప్రదర్శనలు, పూల రచనలపై వర్క్‌షాప్‌లు, బతుకమ్మ చరిత్రను తెలిపే ప్రదర్శనలు ఉంటాయి. మహిళలు అంతా పెద్ద ఎత్తున ఒకచోట చేరి, ఆనందం, సామూహిక భాగస్వామ్యం, సాంస్కృతిక గౌరవాన్ని పెంపొందిస్తుంది. బతుకమ్మ పండుగ విజయవంతం కావడంలో మహిళలు, స్వచ్ఛంద సేవకుల పాత్ర కీలకం. వారు తమ సమయం, నైపుణ్యాలతో కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఉత్సవానికి ఒక ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టిస్తారు. ఈ పండుగ సమాజంలో ఐక్యతను, సామూహిక ఆనందాన్ని తీసుకొస్తుంది. ప్రజలు ఈ సందర్భంలో ఒకచోట చేరి, తమ సంస్కృతిని, వారసత్వాన్ని జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ ఉత్సవం వివిధ సంస్కృతులను కలుపుతూ, ప్రకృతి మరియు సమాజం యొక్క సౌందర్యాన్ని జరుపుకుంటుంది.

# త్రిముఖ పోరులో గెలుపు ఎవరిది

హైదరాబాద్, సెప్టెంబర్ 18, జూబ్లీహిల్స్ లో తీన్మార్ వార్ లోడింగ్ అవుతోంది. బైపోల్ చుట్టూ క్రమంగా మ్యాటర్ వేడెక్కుతోంది. డిసెంబర్ లోగా ఎన్నిక జరగాల్సి ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అలర్ట్ అవుతున్నాయి. క్యాడర్ ను రెడీ చేస్తున్నాయి. రివ్యూలతో స్పీడ్ పెంచేస్తున్నాయ్. మాగంటి మరణంతో వస్తున్న ఈ బైపోల్ పొలిటికల్ గా ఉత్కంఠ పెంచుతోంది. గతంలో మునుగోడు బైపోల్ కు ఏమాత్రం తగ్గకుండా పాలిటిక్స్‌లోడ్ అవుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి ప్రతిష్టాత్మకం. జూబ్లీహిల్స్ బైపోల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ 3 పార్టీలతు చాలా ప్రతిష్ఠాత్మకంగా మారిపోయింది. ప్రజల్లో పట్టు పెరిగిందని నిరూపించుకోవడం కాంగ్రెస్ కు ముఖ్యం. మొన్న కంటోన్మెంట్ పోయింది.. ఇప్పుడు జూబ్లీహిల్స్ కూడా పోతే పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోతుందన్న భయం బీఆర్ఎస్ ది. ఇక్కడ గెలవకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన వైబ్రేషన్ కంటిన్యూ చేయడం కష్టమని బీజేపీ అనుకుంటోంది. పైగా వచ్చేది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎలక్షన్స్. గ్రేటర్ పరిధిలో బీజేపీ క్రమంగా పుంజుకుంటోంది. ఇక్కడ గెలుపు ఆ పార్టీకే కాదు.. మిగితా పార్టీలకూ చాలా కీలకం. అందుకే జూబ్లీహిల్స్ లో పొలిటికల్ గేమ్ షురూ కాబోతోంది. దసరా తర్వాత రిలీజ్. జూబ్లీహిల్స్ బస్తీలన్నీ మార్మోగిపోవాల్సిందంతే. ముఖ్యమైన లీడర్లంతా జూబ్లీహిల్స్ లోనే మకాం వేసేలా స్కెచ్చులు రెడీ అవుతున్నాయ్. సో ఎప్పుడూ లేనంత పొలిటికల్ హీట్ ఖాయమైపోయింది. మరి జూబ్లీహిల్స్ జనం పల్స్ ఎటువైపు? జూబ్లీహిల్స్ బైపోల్ గెలుపు కోసం ఏ పార్టీ వ్యూహం ఎలా ఉంది? ఏ పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువున్నాయ్? ఇప్పుడు వన్ బై వన్ డీ కోడ్ చేద్దాం. అసలు బలమైన అభ్యర్థుల వేట ముగిసిందా? బస్తీమే సవాల్ అంటారా? ముఖ్యమైన లీడర్లంతా జూబ్లీహిల్స్ ప్రచారంలో దిగాల్సిందేనా? అంటే అవునన్న సమాధానమే వస్తోంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పొలిటికల్ స్కెచ్ లు ఎలా ఉన్నాయ్? గతంలో కంటోన్మెంట్ బైపోల్ లో బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు గెలిచి సత్తా చాటింది. అక్కడ శ్రీగణేష్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు కూడా సేమ్ సిచ్యువేషన్. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ గెలిచిన స్థానం. మాగంటి గోపీనాథ్ మరణంతో బైపోల్ వస్తోంది. మరి అక్కడ కూడా పాగా వేసేలా కథ మార్చాలనుకుంటోంది. నిజానికి బైపోల్స్ లో సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి సహజంగానే ఎడ్జ్ ఉంటుంది. ఆ అనుకూలతను పార్టీ విజయం దిశగా మలచుకోవాలనుకుంటోంది. డివిజన్ల ఇన్‌ఛార్జిల మీటింగ్‌లో దిశానిర్దేశం. జూబ్లీహిల్స్ బైపోల్ కోసం ముగ్గురు మంత్రులు, అన్ని కార్పొరేషన్ల ఛైర్మన్లను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. తుమ్మల, పొన్నం, వివేక్ ముగ్గురు మంత్రులకు ప్రచార వ్యూహాలు, నియోజకవర్గంలో గెలుపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ బైపోల్ కోసం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌లు రివ్యూ చేశారు. కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే విషయం పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, అయితే పార్టీ గెలుపుకోసం పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలింగ్ బూత్ ల వారీగా ప్రచార ప్రణాళికలను రెడీ చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలన్నారు. సో కాంగ్రెస్ నుంచి ముగ్గురు నలుగురి పేర్లు వినిపిస్తున్నా నవీన్ యాదవ్ వైపే మొగ్గు చూపుతున్నట్లుగా తెలిసింది. ప్రజల్లో సానుకూలత నిరూపించుకునే టైం. తెలంగాణ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ పాలనపై ప్రజల్లో సానుకూలత ఉందని నిరూపించుకోవడానికి జూబ్లీహిల్స్ బైపోల్ గెలుపు చాలా కీలకం. తాము ఈ 20 నెలల్లో చేసిన కార్యక్రమాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్న సంకేతాలు రుజువు చేసుకోవాలంటే ఇక్కడ విక్టరీ ఇంపార్టెంట్ గా మారింది. దీంతో రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై పాజిటివ్ వైబ్ క్రియేట్ చేయవచ్చని భావిస్తోంది హస్తం పార్టీ. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది. దీంతో బైపోల్స్ లో పట్టు సాధించి గ్రేటర్ పోల్స్ లో సత్తా చాటాలనుకుంటోంది. ప్రతి డివిజన్‌కు రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల ఛైర్మన్‌లను నియమించారు. పైగా ముగ్గురు మంత్రులు పొన్నం, తుమ్మల, వివేక్‌లతో సమన్వయం చేసుకోవడం, రెగ్యులర్ గా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీఎం సూచించారు. ఇన్‌ఛార్జుల నుంచి వివరాలు అడిగిన సీఎం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించిన ఇన్‌ఛార్జులను సీఎం రేవంత్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో ఏమైనా లోపాలుంటే మార్పులు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పేదల్లో చాలా మందికి వైట్ రేషన్ కార్డులు కూడా ఇచ్చేశారు. పెండింగ్ రేషన్ కార్డుల్ని కూడా త్వరలో క్లియర్ చేసేలా చూసుకుంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి. అటు బీఆర్ఎస్ కు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక గెలుపు ఇంపార్టెంట్ గా మారింది. నిజానికి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యుల్నే ఏకగ్రీవం చేసే సంప్రదాయం గతంలో ఉండేది. కానీ కేసీఆర్ వచ్చాక.. అలాంటి సంప్రదాయానికి చెక్ పెట్టారు. గతంలో అభ్యర్థిని పెట్టారు. దీంతో ఇప్పుడు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోయినా.. మిగితా పార్టీలు పోటీ పెడుతున్నాయి. తాజాగా జూబ్లీహిల్స్ లో అభ్యర్థిని బీఆర్ఎస్ ప్రకటించకపోయినా మాగంటి గోపీనాథ్ భార్య పేరునే పరిశీలిస్తున్నారంటున్నారు. మాగంటి కుమార్తెలు నియోజకవర్గంలో ఇప్పటికే అందరినీ కలుస్తున్నారు. ఇప్పటికే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కంటోన్మెట్ ఉప ఎన్నికలో సిట్టింగ్ స్థానాన్ని చేజార్చుకోవడం, లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవకపోవడం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారింది. మరోవైపు ఇటీవల కవిత సస్పెన్షన్ వ్యవహారం కూడా తీవ్ర దుమారం రేపింది. బీఆర్ఎస్ లో అవినీతి వ్యవహారాలపై ఆమె మాట్లాడడంతో పార్టీ ప్రతిష్ఠ మసకబారుతున్న పరిస్థితి. ఈ క్రమంలోనే వస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం గులాబీ పార్టీకి చాలా కీలకంగా మారింది. కొన్ని సర్వేల్లో తమకే అనుకూలంగా రిజల్ట్ వస్తోందని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ప్రచారాలు చేసుకుంటోంది. జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా బీజేపీ అడుగులు. ఇక బీజేపీ కూడా జూబ్లీహిల్స్ లో గెలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు సాధించడం ఆ పార్టీకి కొత్త జోష్ తెచ్చింది. ఈ ఊపును కొనసాగించడం కమలం పార్టీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవలే తెలంగాణ బీజేపీ అధ్యక్ష పగ్గాలు చేపట్టిన ఎన్ రామచందర్‌రావుకు ఈ ఎన్నికలు తొలి సవాల్ గా మారబోతున్నాయి. పార్టీ అభ్యర్థి విజయంతో విక్టరీ షురూ చేయాలన్న టార్గెట్ తో ఉన్నారు. అయితే అభ్యర్థి ఎంపిక విషయంలో, ప్రచార సన్నాహక సమావేశాల్లో పార్టీ కాస్త స్లోడౌన్ అయినట్లుగా కనిపిస్తోంది

# సిటీలో కేబుల్ కష్టాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18, హైదరాబాద్ నగరంలో నెల రోజులుగా ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్స్‌ను అధికారులు కత్తిరించడంతో ఈ సమస్య తలెత్తింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేలాడే తీగలను తొలగించాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలు, ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల సచివాలయం వంటి కీలక సంస్థల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలపై సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవైన ఇంటర్నెట్, కేబుల్ టీవీ, మరియు టెలిఫోన్ కేబుల్స్ ఉన్నాయి.

ఈ కేబుల్స్ నగర జీవనానికి అత్యవసరమైనవి. అయితే, వేలాడే తీగలు వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఇటీవల రామాంతాపూర్‌లో జరిగిన ప్రమాదం వంటి సంఘటనలు జరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీని పరిష్కారంగా, కోర్టు ఆదేశాలతో అధికారులు కేబుల్స్‌ను తొలగిస్తున్నారు. కానీ, ఈ చర్యలు సమస్యను పరిష్కరించడానికి బదులు, సచివాలయం వంటి కీలక ప్రాంతాల్లో సేవల నిలిచిపోవడానికి దారితీశాయి. వర్క్ ఫ్రం హోం ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో అధికారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కేబుల్స్‌ను నిర్వహించే ఆపరేటర్లు లేదా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లపై చర్యలు తీసుకోవడానికి బదులు, అధికారులు కేబుల్స్‌ను నేరుగా కత్తిరించడం ద్వారా ప్రజలకు సేవలను ఆపేస్తున్నారు.

ఇది ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తోంది. టీవీ ప్రసారాలు నిలిచిపోవడం, ఫోన్ సేవలు అందుబాటులో లేకపోవడం, మరియు ఆన్‌లైన్ తరగతులకు అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ చర్యలు చిన్న వ్యాపారాలను మూతపడే పరిస్థితికి తీసుకొస్తున్నాయి.ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ సేవలు నీటి, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాలుగా మారాయి. చట్టప్రకారం, బిల్లులు చెల్లించే ప్రజలకు ఈ సేవలు అందించడం సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత. అయితే, అధికారుల నిర్ణయాలు ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సుప్రీం కోర్టు కూడా ఇంటర్నెట్ సేవలను అంతరాయం కలిగించడం ప్రజల హక్కుల ఉల్లంఘనగా పరిగణించింది. అయినప్పటికీ, హైదరాబాద్‌లో ఈ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.

ఈ సమస్యకు పరిష్కారంగా, అధికారులు కేబుల్ నిర్వాహకులు, సర్వీస్ ప్రొవైడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. వేలాడే తీగల సమస్యను పరిష్కరించడానికి కేబుల్స్‌ను సరిగ్గా నిర్వహించేలా నిబంధనలు అమలు చేయాలి,

కానీ సేవలను నిలిపివేయడం సరైన పరిష్కారం కాదు. సమస్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా, ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చు. అలాగే, ఇంటర్నెట్ మరియు కేబుల్ సేవలను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

# జీరో పర్మిషన్‌తో ఎడా పెడా నిర్మాణాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18, నిజాంపేట్ కార్పొరేషన్ లో అక్ర మార్కులు రెచ్చిపోతున్నారు. ఏలా నిర్మిస్తే మాకెవ్వడు అడ్డు అనేలా విర్ర వీగుతూ ఎడా పెడా అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారు.అంతంతా మాత్రమే అనుమతులు తీసుకొని అక్రమాల రాజ్యాలను నెలకొలపుతున్నారు.కమర్షియల్ భవంతులు ప్రమాద పుటంచున భవనాలు, అక్రమ షెడ్స్ నిర్మి స్తూ మున్సిపల్ ఆదాయానికి శఠగోపం పెడుతున్నారు.కళ్లేదుటే మున్సిపల్ ఆదాయానికి రూ. కోట్లు నష్టం చేస్తూ, పట్టణ ప్రణాళికను చిన్నా భిన్నం చేస్తూ ధర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కంట్రోల్ చేయాల్సిన మున్సిపల్ అధికార యంత్రాం గం చేష్టలుడిగి చూస్తూ కూర్చోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది.నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జీపీఆర్ లే అవుట్ లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు,పాక్షిక అనుమతు లు తీసుకుని కొందరు, అక్రమ షెడ్స్ వేస్తూ ఇంకొందరు ఇలా అక్రమ నిర్మాణాలు చేపడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడు తున్నారు.రూ. కోట్లలో మున్సిపల్ ఆదా యం అక్రమ నిర్మాణాలతో కోల్పోతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవ డం లేదు. ఇక్కడ ఓ బిల్డర్ హెచ్ఎం డీఏ అనుమతులు తీసుకొని సుమారు 400 చదరపు గజాల విస్తీర్ణంలో రెండు భవంతులు నిర్మిస్తున్నాడు.ఈ భవంతులను హెచ్ఎండీఏ అప్రూవల్ ప్లాన్ ప్రకారం కాకుండా ప్లాన్ వైలేట్ చేస్తూ అక్రమ ఫ్లోర్స్ నిర్మాణం చేపట్టాడు.వాటర్ ట్యాంక్ సాకుతో మరో 2బీహెచ్కే నిర్మాణం కోసం స్లాబ్స్ వేసి వదిలేశాడు. హెచ్ ఎం డీ ఏ నుండి ఓసీ, మార్టిగేజ్ లు రిలీజ్ అయ్యా క సడీ సప్పుడు కాకుండా దొంగ చాటుగా మరో అక్రమ నిర్మాణం చేపట్టెందుకు కుయుక్తులు పన్నుతు న్నాడు. ప్లాన్ ప్రకారం కాకుండా ఇలా ఎందుకు ఎక్స్ట్రా స్లాబ్స్ వేశావ్ అని మున్సిపల్ సిబ్బంది ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ తన ప్రాపర్ అప్రూవల్ ప్లాన్ షో చేయకుండా అధికారులకు సవాల్ విసురుతు న్నాడు.జీపీఆర్ లే అవుట్ లో మరో బిల్డర్ ఏ మాత్రం మున్సిపల్ అనుమతులు లేకుండా సుమా రు 250 చదరపు గజాల విస్తీర్ణం లో ధర్జాగా జీ +1 భవంతి నిర్మిస్తున్నాడు.ఇక్కడ ఆర్ఓ గా పని చేసి వెళ్లిన ఓ అధికారి ప్రస్తుతం పక్క మున్సిపాలిటీ లో కమిషనర్ గా విధులు చేపడుతున్నాడు.ఆ కమిషనర్ ఇక్కడి నిజాంపేట్ మున్సిపల్ అధికారులకు ఆ అక్రమ నిర్మాణం తనదే అక్కడికి వెళ్ళకండి అంటూ హుకుం జారీ చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు గప్ చుప్ గా ఉంటూ అక్రమ నిర్మాణంకు ప్రత్యక్ష సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అదే ప్రాంతంలో మరో బిల్డర్ సుమారు 200 చదరపు గజాలలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా జీ+2 బిల్డింగ్ నిర్మించి ధర్జాగా కమర్షియల్ షెటర్స్ ఏర్పాటు చేశాడు. ఈ భవంతి పై కోర్టు లో స్టేటస్ కో ఉన్నా చక చకా అక్రమ నిర్మాణం పనులు చేపడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నాడు.అలాగే ఏడీఆర్ హై రైజ్ బిల్డింగ్స్ సమీపంలో సైతం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ షెడ్స్ నిర్మాణం ధర్జాగా చేపడుతూ అక్రమార్కులు రాజ్యం ఏళు తున్నారు.ఇలాంటి అక్రమ నిర్మాణాల పరంపర నిజాంపేట్ కార్పొరేషన్ లో నిత్యం చోటు చేసుకోవడం అధికారులు మౌనం వహించడం పై పలు ఆరోపణలు వెలువడుతున్నాయి.అయితే ఈ అక్రమ నిర్మాణలపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీపీవో వివరణ కొరకు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించడం లేదు.

# సర్కార్ బడుల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18, తెలంగాణ విద్యా వ్యవస్థలో మార్పులు రానున్నాయి. ఒకటో తరగతిలో చేరే పిల్లల వయసును ఆరు సంవత్సరాలకు పెంచాలని విద్యా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అంతేకాదు.. ప్రభుత్వ బడుల్లో నర్సరీ తరగతులు కూడా మొదలుకానున్నాయి. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడుల్లోనూ చిన్న పిల్లలకు చదువు చెప్పేందుకు కొత్త విధానం రాబోతోంది. ఈ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.ప్రీ-ప్రైమరీ విద్య: మూడేళ్లు నిండిన పిల్లలను నర్సరీలో, నాలుగేళ్లు నిండిన వారిని ఎల్‌కేజీలో చేర్చుకోవాలి. ఈ నిబంధన అన్ని రకాల పాఠశాలలు, బోర్డులకు వర్తించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కమిషన్ కోరింది.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ: ప్రైవేట్ పాఠశాలల్లో మూడేళ్ల నుంచే పిల్లలను చేర్చుకుంటున్నందున, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడానికి ఇష్టపడటం లేదని కమిషన్ గుర్తించింది. దీని వల్ల అణగారిన వర్గాల పిల్లలు నాణ్యమైన ప్రీ-ప్రైమరీ విద్యకు దూరమవుతున్నారని నివేదికలో పేర్కొంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించాలని సూచించింది.దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో మాత్రమే ఒకటో తరగతిలో చేరడానికి ఐదేళ్ల నిబంధన ఉందని, మిగిలిన రాష్ట్రాలు ఆరేళ్ల నిబంధనను ఇప్పటికే అమలు చేస్తున్నాయని కమిషన్ నివేదికలో వివరించింది. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా యూకే, అమెరికా, జపాన్ వంటి ప్రముఖ దేశాల్లో కూడా ఆరేళ్ల నిబంధన అమల్లో ఉందని తెలిపింది. సీబీఎస్ఈ, ఐబీ వంటి అంతర్జాతీయ బోర్డులు కూడా ఇదే విధానాన్ని పాటిస్తున్నాయని పేర్కొంది.తెలంగాణ ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచే వెయ్యి పాఠశాలల్లో 'ప్రీ-ప్రైమరీ' పేరుతో కేవలం యూకేజీని మాత్రమే ప్రవేశపెట్టింది. ఈ దశలో కమిషన్ పూర్తిస్థాయిలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించాలని సిఫార్సు చేయడం గమనార్హం. ఈ మార్పులు అమలులోకి వస్తే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత పెరిగి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడానికి మరింత ఆసక్తి చూపవచ్చు. ఈ సిఫార్సులపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం వేచి చూడాలి.

## ఏసీబీ వలలో తాహాశీల్దార్, ఇద్దరు సిబ్బంది

ఖమ్మం రైతు వద్ద లంచం తీసుకుంటున్న ఓ తహాశీల్దారు, ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ తలహాశీల్థార్ వంకాయల సురీష్ ఒక రైతుకి సంబంధించిన 10 కుంటల భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి పదివేల రూపాయలు డిమాండ్ చేసారు. ఆర్.ఐ మాలోతు భాస్కర్,ధరణి ఆపరేటర్ రాథోడ్ ల ద్వారా పదివేలు లంచం తీసుకుంటుండగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డిఎస్పి వై రమేష్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు ప్రజలను లంచం డిమాండ్ చేస్తే తమను సంప్రదించాలని ఆయన కోరారు..

## కుక్కల దాడిలో దుప్పి మృతి

సత్తుపల్లి పట్టణం లోని పాలకేంద్రం సమీపంలో కుక్కల దాడిలో గాయపడి ఓ అడవి దుప్పి మృతి చెందింది.పాల కేంద్రానికి ఆనుకొని ఉన్న అర్బన్ పార్క్ నుండి అడవి దుప్పి బయటకు రావడంతో కుక్కలు దాడి చేశాయి.దీంతో తీవ్రంగా గాయపడిన దుప్పి మృతి చెందింది.స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని దుప్పి కళేబరాన్ని తీసుకువెళ్లారు.అయితే కొద్ది గంటల ముందే సింగరేణి సమీపంలో కుక్కల దాడితో అడవి దుప్పి తీవ్రంగా గాయపడింది.దానిని రక్షించిన స్థానికులు సింగరేణి అధికారులకు అప్పగించారు.అంతలోనే మరో దుప్పి కుక్కల దాడిలో మృతి చెందింది.నీలాద్రి అర్బన్ పార్క్ నుండి అడవి దుప్పులు జనావాసాలలోకి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు..

## సికింద్రాబాద్ లో ఈడీ దాడులు

సికింద్రాబాద్.. వెస్ట్ మారేడుపల్లిలోని వెల్డింగ్టన్ ఎంక్లేవ్ లో ఉన్న వ్యాపారవేత్త బూరుగు రమేష్ అతని కుమారుడు విక్రాంత్ నివాసాలపై ఈడి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. విల్లా నెంబర్ 26 లో నివాసం ఉంటున్న బూరుగు రమేష్ నివాసంలో ఉదయం నుండి ఈడీ అధికారులు సోదాలు ప్రారంభించారు. రెండు బృందాలతో ఈడి అధికారులు సోదాలు చేస్తున్నారు. కాస్పో లీగల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మహాదేవ జువెలర్స్ తోపాటు రాజశ్రీ ఫుడ్స్ లో బూరుగు విక్రాంత్ డైరెక్టర్ గా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బంగారం దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తుంది

# దివాళా దిశగా పాకిస్తాన్


ప్రస్తుతం పాకిస్తాన్లో ఆర్థిక, రాజకీయ గందరగోళం ఏర్పడింది. దాని కారణంగా ఈ దేశం దివాళా అంచున ఉంది. పాకిస్థాన్ పరిస్థితి గురించి ప్రపంచం మొత్తానికి బాగా తెలుసు. అదే సమయంలో ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గేందుకు పాకిస్థాన్ కూడా సిద్ధంగా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న కాలంలో ఈ దేశ పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం కనిపిస్తోంది. పాక్ పరిస్థితి కారణంగా ప్రపంచంలోని రెండు దేశాలు చాలా ఆందోళన చెందుతున్నాయి. ఈ రెండు దేశాలు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ రెండు దేశాలు పాకిస్తాన్లో చాలా పెట్టుబడులు పెట్టాయి కాబట్టి ఈ రెండు దేశాల ఆందోళన చెందుతున్నాయి. చైనా, జపాన్లు అమెరికా ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు పెట్టే స్థితిలో ఉన్నట్లే, పాకిస్థాన్ పరిస్థితి కారణంగా ఈ రెండు దేశాలు కూడా భారీ నష్టాలను చవిచూడవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో అనేక రకాల పరిస్థితులు సృష్టించబడుతున్నాయి. ఇందులో పాకిస్తాన్ పుంజుకునే పరిస్థితి ఎక్కడా కనిపించదు. విదేశీ రుణాలను తిరిగి చెల్లించడానికి పాకిస్తాన్ వద్ద ఎటువంటి నిధులు లేవు. పొరుగు దేశం వద్ద కేవలం 4 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరోవైపు చైనా, యూఏఈ, సౌదీ అరేబియా పాకిస్థాన్కు సాయం చేస్తాయని ఊహాగానాలు కూడా వచ్చాయి. ఈ దేశాలన్నీ కలిసి వచ్చిన తర్వాత కూడా పెద్దగా నిధులు సేకరించలేకపోయాయికొద్ది వారాలు పాకిస్తాన్లో వరదలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. లక్షలాది మంది వరదల బారినపడ్డారు. జనజీవనం అస్తవ్యస్తమైంది.ఆహార పదార్థాల ధరలు కూడా బాగా పెరిగాయి. రెండు వారాల్లోనే పాకిస్తాన్లోని అనేక ప్రాంతాల్లో 20 కిలోల గోధుమ పిండి బస్తా ధర 2,500 రూపాయలకి చేరింది.బియ్యం ధరల్లో కూడా భారీగా పెరుగుదల కనిపించింది.25 కిలోల బియ్యం సంచి ఇప్పుడు 9 వేల నుంచి 9,500 రూపాయలకు అమ్ముడవుతోంది, ఇంతకుముందు రూ.8 వేలు ఉండేదని కమిషన్ ఏజెంట్లు చెబుతున్నారు.25 కిలోల బియ్యం బస్తా ధర గతంలో కంటే 1,000 రూపాయలకు పైగా పెరిగింది. ఒక్కో కేజీకి 40 రూపాయల వరకూ పెరిగింది.వరదల తర్వాత, మార్కెట్కు గోధుమల సరఫరా తగ్గిందని, గోడౌన్లలో నిల్వ చేసిన ధాన్యం కూడా పాడైపోయిందని పిండి మిల్లుల యజమానులు చెబుతున్నారు. ధరలు పెరగడానికి ఇదే కారణమని వారంటున్నారు.అయితే, ఆహార పదార్థాల కొరత కంటే నిల్వలు దాచిపెట్టుకోవడం, లాభార్జన కోసం చూడడం వల్లే ధరలు పెరుగుతున్నాయని నిపుణులంటున్నారు.వరదల వల్ల కొరత ఏర్పడిందా? లేదంటే నిల్వలు దాచుకుంటున్నారా? ఈ సమస్యను అర్థం చేసుకోవడానికి, పిండి మిల్లుల యజమానులు, ధాన్యం మార్కెట్కు చెందిన వ్యాపారులు, నిపుణులతో బీబీసీ మాట్లాడింది.పాకిస్తాన్లో గోధుమలు, పిండి ధరలు సాధారణంగా ఏటా సెప్టెంబర్ తర్వాత పెరుగుతాయి.ఈ సమయంలో, కొత్త పంట వచ్చినప్పుడు, ప్రజలు తమ అవసరాల కోసం గోధుమలు కొంటారు. అవి అయిపోతే మార్కెట్లో పిండి కొనడం ప్రారంభిస్తారు. పిండి మిల్లులు కూడా మార్కెట్ నుంచి గోధుమలను కొని పిండిగా మార్చి అమ్ముతాయి.దీనివల్ల డిమాండ్ పెరిగినప్పుడు.. పిండి, గోధుమల ధరలు కూడా పెరుగుతాయి. దీనిని 'సీజనల్ సైకిల్' అంటారు. దీనిని నియంత్రించడానికి ప్రభుత్వం తన గిడ్డంగులలోని గోధుమలను మార్కెట్లో విక్రయిస్తుంది. స్టాక్ తక్కువగా ఉంటే దిగుమతులు చేసుకుంటారు. దీంతో ధరలు మామూలుగా ఉంటాయి.ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ సంవత్సరం పాకిస్తాన్లో మొత్తం గోధుమ ఉత్పత్తి 29.6 మిలియన్ టన్నులు. 32 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే, ప్రభుత్వం వద్ద అదనపు గోధుమ నిల్వలున్నాయి.ఐఎంఎఫ్ ఒత్తిడి, ప్రభుత్వ గిడ్డంగులలో అదనపు గోధుమలు ఉండటం వల్ల, ప్రభుత్వం రైతుల నుంచి గోధుమలు కొనలేదు. దీంతో, మార్కెట్లో ధరలు తగ్గడం మొదలైంది.గత ఏడాది మాండ్(సుమారుగా 40 కిలోలు) గోధుమల ధర 3,900 రూపాయలుంటే.. ఇప్పుడు 1,800 నుంచి 2,000 రూపాయలకు తగ్గింది. అందుకే రైతులు నిరసనలు ప్రారంభించారు."గోధుమ ధరలు తక్కువగా ఉన్నప్పుడు, సాధారణంగా గోధుమలను కొనని అనేక రంగాలవారు కూడా వాటిని కొనడం మొదలుపెట్టారు. ఉదాహరణకు పౌల్ట్రీ ఫీడ్, పశుగ్రాస ఫ్యాక్టరీల వంటివారు. ఎందుకంటే, దాణాలో ఉపయోగించే మొక్కజొన్న వంటి ఇతర పదార్థాల కంటే గోధుమలు చౌకగా ఉంటాయి" అని కమొడిటీ నిపుణులు షంసుల్ ఇస్లాం చెప్పారు.

ఈ సంవత్సరం పంట కోతల తర్వాత గోధుమ ధర తగ్గడం వల్ల, పిండి కూడా చౌకగా మారిందని ఆయన తెలిపారు."పాకిస్తాన్, భారత్ యుద్ధ సమయంలో బియ్యం, గోధుమల నిల్వల్లో అకస్మాత్తుగా పెరుగుదల కనిపించింది. అప్పుడు పిండి మిల్లులు కూడా గోధుమలను నిల్వ చేశాయి. ఇతరులు కూడా రంగంలోకి దిగారు" అని షంసుల్ ఇస్లాం తెలిపారు.ఆగస్ట్ మధ్య నుంచి భారీ వర్షాల కారణంగా పంజాబ్లోని చాలా ప్రాంతాల్లో వరద పరిస్థితి కొనసాగుతోంది.ఆగస్ట్ చివరిలో కేంద్ర ఆహార భద్రతా మంత్రి రాణా తన్వీర్ అహ్మద్ అధ్యక్షతన గోధుమ బోర్డు సమావేశం జరిగింది. దేశంలో తగినంత గోధుమ నిల్వలు ఉన్నందున, ప్రభుత్వం గోధుమలను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదని నిర్ణయించారు.గోధుమలను దిగుమతి చేసుకోబోమని ప్రభుత్వం చేసిన ప్రకటన తర్వాత తమ ఇష్టానుసారం మార్కెట్లో ధరలను పెంచొచ్చు, తగ్గించొచ్చు అని నిల్వదారులు గ్రహించారు" అని షంసుల్ ఇస్లాం అన్నారు.ఒక మాండ్ గోధుమలను 2,200 రూపాయలకు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు 4,000 రూపాయల చొప్పున అమ్ముతున్నారని, అందుకే వినియోగదారులకు పిండి రేటు పెరిగిందని ఆయన తెలిపారు.మార్కెట్లో గోధుమల ధరలు పెరగడం వల్లే పిండి ధర పెరుగుతోందని ఫ్లోర్ మిల్ అసోసియేషన్ వాదిస్తోందని షంసుల్ ఇస్లాం అంటున్నారు.20 కిలోల బ్యాగ్ ధర 1,500 రూపాయలు నుంచి 2,500 రూపాయలకు పెరిగిందని ఆయన అన్నారు.ఇటీవల, పంజాబ్ ప్రభుత్వం గోధుమ నిల్వలపై చర్య తీసుకుని, పశుగ్రాస మిల్లుల గోడౌన్ల నుంచి లక్ష టన్నులకు పైగా గోధుమలను స్వాధీనం చేసుకుంది.ఈ గోధుమలను ఒక్కో మాండ్కు 3,000 రూపాయల చొప్పున, 20 కిలోల పిండి బస్తాను 1,810 రూపాయల చొప్పున విక్రయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.పంజాబ్లో ధరలను స్థిరీకరించడానికి, ప్రభుత్వం ప్రతి నెలా కనీసం 5 లక్షల టన్నుల గోధుమలను మార్కెట్లోకి విడుదల చేయాల్సి ఉంటుందని పిండి మిల్లుల సంఘం అంటోంది.పాకిస్తాన్లో పిండి ధరలు అకస్మాత్తుగా పెరిగిన తర్వాత, ఖైబర్ పఖ్తుంఖ్వాలో 20 కిలోల పిండి బ్యాగ్ 900 నుంచి 1,000 రూపాయలకు అమ్ముడవుతోంది. ఇప్పుడు అదే 20 కిలోల బ్యాగ్ 2,400 రూపాయల నుంచి 2,500 రూపాయలకు అమ్ముడవుతోంది. పిండి ధర పెరగడంతో, బ్రెడ్ ధర కూడా పెరిగింది.ఖైబర్ పఖ్తుంఖ్వా గోధుమల కోసం పంజాబ్పై ఆధారపడి ఉందని ఖైబర్ పఖ్తుంఖ్వా ఆహార మంత్రి జహీర్ షాహ్ టోరో బీబీసీ ప్రతినిధి అజీజుల్లాహ్ ఖాన్తో చెప్పారు. బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాతో సహా ఇతర ప్రాంతాలలో కూడా పిండి ధర గణనీయంగా పెరిగింది. గతంలో 1600 రూపాయలకి లభించే 20 కిలోల పిండి సంచి ఇప్పుడు 2,000 నుంచి 2,100 రూపాయలకు పెరిగింది.మార్కెట్లో సరఫరా కొరత కారణంగా పిండి ధర పెరిగిందని స్థానిక వ్యాపారులు అంటుంటే.. వరదలు, పంజాబ్ నుంచి పిండి రవాణాపై నిషేధం దీనికి ప్రధాన కారణమని ఆహార శాఖ అధికారులు చెబుతున్నారు.గోధుమలు, పిండి ధరలు పెరిగిన తరువాత ప్రావిన్షియల్ ప్రభుత్వం గోధుమలు, పిండి, ఇతర గోధుమ ఉత్పత్తుల అంతర్-ప్రాంతీయ తరలింపును నిషేధించిందని పంజాబ్ ప్రభుత్వం చెబుతోంది.

## కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన రెండవ భారతీయ అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్

### -సునీతా విలియమ్స్ ను పద్మ భూషణ్ పురస్కారంతో గౌరవించిన భారత్

### -నేడు ఆమె జన్మదినం



కొలంబియా విపత్తులో మరణించిన కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన రెండవ భారతీయ అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్, సునీతా లిన్ విలియమ్స్ ను సునీతా పాండ్య అని కూడా పిలుస్తారు.ఆమే యునైటెడ్ స్టేట్స్ నావికాదళ అధికారిణిగా, నాసా వ్యోమగామిగా. అంతర్జాతీయ అంతరిక్ష స్టేషను నిర్వహించిన సాహసయాత్ర 14కు సభ్యురాలిగా చేసింది ఆ తర్వాత, ఆమె సాహసయాత్ర 15లో చేరింది. 1983లో విలియమ్స్ మేరీల్యాండ్లోని అన్నాపోలిస్లోని యు.ఎస్. నావల్ అకాడమీలో ప్రవేశించింది. ఆమె 1987లో నావల్ ఏవియేషన్ ట్రైనింగ్ కమాండ్ వద్ద ఏవియేటర్ శిక్షణ పొంది తరువాత జూలై 1989లో ఆమె యుద్ధ హెలికాప్టర్ శిక్షణను పూర్తిచేసింది. పెర్షియన్ గల్ఫ్ యుద్ధానికి సన్నాహక కార్యక్రమాలలో, ఇరాక్లోని కుర్దిష్ ప్రాంతాలపై నో ఫ్లై జోన్ల స్థాపనలో, అలాగే 1992లో మయామిలో ఆండ్రూ హరికేన్ సమయంలో సహాయక కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నది. ఆమె మరో నాసా వ్యోమగామి బారీ విల్మోర్ తో కలిసి అంతరిక్ష కేంద్రంలోకి 2024 జూన్ 5న కేవలం 10 రోజుల మిషన్లో భాగంగా ఈ రోదసీ యాత్రను చేపట్టారు. జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సి ఉండగా, స్టార్లైనర్ వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా టెక్నికల్ ప్రాబ్లమ్స్ ఎదురయ్యాయి. దీంతో వీరి ప్రయాణం వాయిదా పడింది. ఆ తర్వాత జూన్ 26న ఖరారు చేస్తూ నాసా ప్రకటించింది. మళ్ళీ మరోసారి వాయిదా పడింది. చివరికి సెప్టెంబరు 7న సునీతా విలియమ్స్, బారీ ఇ విల్మోర్ లేకుండానే బోయింగ్ భూమి మీదకు వచ్చేసింది. వారు 9 నెలల నిరీక్షణ తరువాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి 2025 మార్చి 19న సురక్షితంగా భూమిపైకి చేరుకున్నారు.జనవరి 2025 నాటికి, సునీతా విలియమ్స్ మొత్తం 62 గంటల 6 నిమిషాల పాటు తొమ్మిది స్పేస్వాక్స్ చేసింది, దీంతో ఆమె మహిళల్లో నంబర్ వన్ స్థానంలో, అత్యంత అనుభవజ్ఞులైన స్పేస్వాకర్ల జాబితాలో నాల్గవ స్థానంలో నిలిచింది.సునీత అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో 19 సెప్టెంబర్ 1965లో జన్మించింది. తండ్రి దీపక్ పాండ్య భారతదేశంలోని గుజరాత్ రాష్ట్రానికి చెందినవాడు. తల్లి బోనీ జలోకర్ స్లోవేకియా దేశస్తురాలు. వీరికి ఉన్న ముగ్గురు సంతానంలో సునీత చివరిది. ఆమె అమెరికాలోని నవల్ అకాడెమీలో ఫిజిక్స్ డిగ్రీ, ఫ్లోరిడా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజనీరింగ్ మేనేజ్మెంట్ లో మాస్టర్స్ పూర్తి చేసింది.తండ్రి సూచనతో నౌకాదళంలో బేసిక్ డైవింగ్ ఆఫీసర్ గా చేరింది. నేవల్ ఏవియేటర్ గా హెలికాప్టర్ కంబాట్ సపోర్ట్ స్క్వాడ్రన్3 నేతృత్వంలో యుద్ధ విమానాలు నడపడంలో శిక్షణ తీసుకుంది.విలియమ్స్ టెక్సాస్లో ఫెడరల్ మార్షల్ అయిన మైఖేల్ జె. విలియమ్స్ను వివాహం చేసుకున్నారు. ఇద్దరూ వారి కెరీర్ ప్రారంభంలో హెలికాప్టర్లను నడిపారు. సునీత విలియమ్స్ హిందూ మతాన్ని ఆచరిస్తున్నారు. డిసెంబర్ 2006లో ఆమె భగవద్గీత ప్రతిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లింది. జూలై 2012లో ఆమె ఓం గుర్తును మరియు ఉపనిషత్తుల ప్రతిని తీసుకుంది.30 సంవత్సరాల వృత్తిలో వివిధ ఎయిర్ క్రాఫ్ట్ లపై 2770 విమాన ( ఫ్లైట్ అవర్స్) గంటల అనుభవం గడించింది..నాసా ఆమెను వ్యోమగామిగా ఎంపిక చేసింది. 1998లో అంతరిక్ష యానం లో శిక్షణ తీసుకుంది. కల్పన చావ్లా తరువాత అంతరిక్షం లోకి వెళ్ళిన రెండవ మహిళ ఈమె. తొలి పర్యటన డిసెంబరు 2006 నుండి జూన్ 2007 వరకు జరిగింది. రెండోసారి 2012లో నాలుగు నెలల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లో గడిపింది. అంతరిక్షం లో గడిపిన 322 రోజులలో ఒక రోజు కూడా వ్యాయామం మానలేదు. అంతరిక్ష మొదటి ప్రయాణం లో ఆరు నెలలు సౌర ఫలకాలను అమర్చడం, ప్రయోగాలకు అనువుగా ఆ కేంద్రాన్ని మరమ్మత్తులు చేయడం వంటివి చేసింది. రెండవ సారి ఆర్బిటింగ్ ప్రయోగశాల పై పరిశోధనలు జరిపింది.సునీత సముద్ర గర్భంలోనూ పరిశోధనలు చేపట్టింది. అమెరికాలోని ఫ్లోరిడాకు దగ్గరలో కీలర్గో అనే ప్రాంతంలో 9 రోజుల పాటు జరిగే అన్వేషణలో సముద్ర గర్భంలో మానవ అవాసానికి వీలయ్యే పరిస్థితులను పరిశోధించే "నాసా ఎక్స్ట్రీమ్ ఎన్విరాన్మెంట్ మిషన్ ఆపరేషన్స్" బృందం తో కలిసి పని చేసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఎనిమిది రోజుల మిషన్ కోసం బోయింగ్ స్టార్లైనర్ అంతరిక్ష నౌకలో చేరుకున్నారు. దానిలో తలెత్తిన సమస్యల కారణంగా తొమ్మిది నెలల అక్కడే ఉన్నారు. వ్యోమగాములు సురక్షితంగా తిరిగి రావడానికి నాసా, స్పేస్ఎక్స్ సహకారంతో 2025 మార్చి 15న క్రూ-10 మిషన్ను ప్రారంభించింది. వారు 286 రోజుల అంతరిక్ష ప్రయాణం తర్వాత 2025 మార్చి 18న భూమికి తిరిగి క్షేమంగా వచ్చారు.2008లో భారత ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించి గౌరవించింది. అంతరిక్షం నుండి భారతదేశం ఎలా ఉంది అనే ఈ ప్రశ్నకు నాడు భారత వ్యోమగామి రాకేష్ శర్మ ప్రముఖ కవి ముహమ్మద్ ఇక్బాల్ రాసిన 'సారే జహాన్ సే అచ్చా' అంటూ సమాధానం చెప్పారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఇదే ప్రశ్నకు భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి అద్భుతమైన హిమాలయాలను చూసిన సంగతిని ఆమె గుర్తుచేసుకున్నారు.

## లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ

### - తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



జయశంకర్ భూపాలపల్లి.18 .లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఉదయం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుంటపల్లిలో జరిగిన లంబాడీల తీజ్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పెళ్లికాని యువతులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం డీజే పాటలకు యువతులతో కలిసి ఎమ్మెల్యే స్టెప్పులేసి సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ...ఈ తీజ్ పండుగలో పెళ్లికాని యువతులు ఆట పాటలతో ఆనందంగా పాల్గొనడం మన ఆచారాలు, విలువలను భావితరాలకు తీసుకువెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లంబాడీ కులస్తుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, లంబాడీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. తీజ్ వంటి పండుగలు సామాజిక ఐక్యతకు, సాంస్కృతిక పరిరక్షణకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.



## రామగుండం ఈఎస్ఐ హాస్పిటల్, ఎయిర్ పోర్ట్ వివరాలు అడిగితే ఎందుకు స్పందించరు?

### ఎంపీ హోదాలో వివరాలు అడిగితే ఇంత నిర్లక్ష్యమా?

### ఎంపీకే సమాధానం ఇవ్వకపోతే సామాన్య ప్రజలకు ఏం న్యాయం చేస్తారు.

పెద్దపల్లి ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టర్ వైఖరి పై అసహనం వ్యక్తం చేశారు. రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి, ఎయిర్ పోర్ట్ వివరాలు అడిగితే నా దగ్గర లేవు అనే నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం,సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే స్పందించకపోవడం మెసేజ్ లు చేసిన రిప్లై ఇవ్వకపోవడం పట్ల కలెక్టర్ కుల శ్రీహర్ష పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి లో స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృవందన పథకం కింద ప్రసూతి ప్రయోజనాలను మహిళలకు వివరించారు.మహిళలు ఈ కార్యక్రమన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు.మహిళలు బాగుంటేనే కుటుంబం బాగుంటుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు,ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రికి అంబులెన్స్ అవసరం ఉందని ఎంపీని కోరారు.దీంతో తప్పకుండా ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తర్వాత పక్కనే కొత్తగా నిర్మిస్తున్న ప్రధాన ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు.బిల్డింగ్ పనులు ఎలా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజా సమస్యలపై సమాచారం అందిస్తే ఎందుకు స్పందించడం లేదని ఎంపీ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను ప్రశ్నించారు.రామగుండం ఎయిర్ పోర్ట్,ఇూఎ ఆస్పత్రి వివరాలు అడిగితే ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎంపీ హోదా లోనే వివరాలు అడిగితే ఇవ్వలేదంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రజల ద్వారా ప్రజల కొరకు ఎన్నికైన నేను ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాసేవ చేసేందుకే ఎంపీగా ఉన్నానని కలెక్టర్ పై మండిపడ్డారు.ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలనేది రిక్వెస్ట్ కాదని కలెక్టర్ గా మీ బాధ్యత అని గుర్తుకు చేశారు.ఎవరైనా ఎంపీ చెప్పిన పనులకు చేయొద్దని నిబంధనలు ఏమైనా పెట్టారా అని కలెక్టర్ ను ప్రశ్నించారు.దీంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష కి ఏమి సమాధానం ఇవ్వాలో నోటి నుండి మాట రాలేదు.

# జగిత్యాలలో ఆన్లైన్ గేమ్స్ కు బిటెక్ విద్యార్థి బలి

**విద్యానగర్ కు చెందిన రాహుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య**
**ఆన్‌లైన్ గేమ్స్ కు బానిస కావడంతో మందలించిన తండ్రి శ్రీనివాస్.**
**మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న రాహుల్**
**యువకుల ప్రాణాలను బలిగొంటున్న ఆన్లైన్ గేమ్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**

జగిత్యాల జిల్లాలో ఆన్ లైన్ గేమ్ కు బీటెక్ విద్యార్థి బలయ్యాడు. జగిత్యాల విద్యానగర్ కు చెందిన రాహుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్లైన్ గేమ్ కు బానిసై చదువుకు దూరమై ఇంటి వద్ద ఉండడంతో తండ్రి మందలించాడు. మనస్థాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో పేరెంట్స్ కన్నీరుమున్నీరుగా విలపించారు. కిరాణా దుకాణంతో కుటుంబాన్ని పోషించుకునే తండ్రి శ్రీనివాస్ కొడుకును మేనేజ్మెంట్ కోట కింద బీటెక్ లో చేర్పించాడు. సెకండ్ ఇయర్ లో ఫెయిల్ అయిన రాహుల్ ఇంటి వద్దనే ఉంటూ ఆన్లైన్ గేమ్ లో మునిగిపోయాడు. ఆన్లైన్ గేమ్ కు బానిసై అప్పుల పాలైన రాహుల్ ను సన్మార్గంలో నడిపించేందుకు పేరెంట్స్ చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా చివరకు బలవణ్మరణానికి పాల్పడంతో తీవ్ర ఆవేదన చెపుతున్నారు. యువకుల ప్రాణాలను పలికొంటున్న ఆన్లైన్ గేమ్ లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆన్లైన్ గేమ్ తో యువకుడు ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## కరీంనగర్ జిల్లా విలాసాగర్ గ్రామాన్ని దిగ్బంధం చేసిన పోలీసులు...
## తనిఖీలతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 30 ట్రాక్టర్ల సీజ్

జమ్మికుంట కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలతో ప్రజల్ని భయాందోళన చేశారు. ఏసిపి మాధవి ఆధ్వర్యంలో స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసులు, సివిల్ పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. భారీగా మోహరించిన పోలీసులతో ఏమవుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందారు. ఇంటింటా సోదాలు నిర్వహించన పోలీసులు అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 30 ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎవరిపై  అనుమానం వస్తె పోలీసులకు సమాచారం అందజేయాలని ఏ సి పి మాధవి కోరారు.

# గ్రామంలో ఇరుక్కున్న ఉపాధ్యాయులు



కొమురం భీం ఆసిఫాబాద్కొమురం భీం జిల్లా:వారంతా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు..రోజు వారి లాగే పాఠశాలకు వెళ్ళి డ్యూటి ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఆ గ్రామ వాగు ఒక్క సారిగా ఉదృతంగా ప్రవహిస్తుండడంతో గంటల తరబడి నిరీక్షించిన ప్రవాహం తగ్గకపోవడంతో వాగును దాటలేక రాత్రంతా  పాఠశాలలోనే బస చేసిన సంఘటన ఆసిఫాబాద్ మండలం వాడిగొంది(ఎన్), చెల్కగూడ లో చోటు చేసుకుంది... ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఆసిఫాబాద్ మండలంలోని వాడిగొంది(ఎన్),చెల్కగూడ వాగు ఉదృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో ఆ గ్రామ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు స్వాతి,సుమలత,నైతం హరిప్రకాశ్, కుర్సెంగా జాలింషా నిన్న సాయంత్రం విధులు ముగిసిన అనంతరం ఆసిఫాబాద్ కు పయనమయ్యారు..ఈ క్రమంలో వాగులో ప్రవాహం ఎక్కువ ఉండటంతో గంటల తరబడి నిరీక్షించి చేసేదేమీ లేక తిరిగి పాఠశాలకు చేరుకున్నారు..గ్రామస్థులు సౌకర్యం కల్పించడంతో పాఠశాలలోనే బస చేశారు..అయితే గురువారం ఉదయం 11గంటల వరకు పాఠశాలలోనే బస చేసిన అనంతరం వారిని  గ్రామస్థులు సురక్షితంగా వాగు దాటించారు.. వాగు ప్రవాహం కాస్త తగ్గడంతో నడుం లోతు నీటి నుంచి స్వాతి, సుమలత ఇద్దరు టీచర్లను గ్రామస్థులు వాగు దాటించారు. ప్రతి రోజు సాహసం చేసి వాగు దాటి వాడిగొంది విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. వారిని గ్రామస్థులు సాహస టీచర్లుగా పిలుస్తున్నారు..

# రోడ్ల కోసం నిరసన

కొమురం భీం పోరాట గడ్డ అయిన ఆసిఫాబాద్ జిల్లా లో చాలా గ్రామాలకు రోడ్డు, వంతెన సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫాబాద్ మండలం వాడిగొంది గ్రామానికి వెళ్లేందుకు వాగును దాటాల్సిన దుస్థితి నెలకొంది. దశాబ్దాలుగా సౌకర్యాలు లేక అనేక కష్టాలు పడుతున్నామని అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఆరోగ్యం క్షీణించినా వాగు దాటలేక నాటు వైద్యంపై ఆధారపడుతున్నామని, ప్రభుత్వం స్పందించి రోడ్డు, వంతెన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

# మంథనిలో సిబిఐ అధికారులు

పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామానికి సిబిఐ అధికారులు వచ్చారు. గట్టు వామన్ రావు నాగమణి దంపతుల హత్య కేసును సీబీఐకి సుప్రీంకోర్టు అప్పగించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలతో సిబిఐ అధికారలు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు. వామన్ రావు తండ్రీ గట్టు కిషన్ రావు ఇంటికి చేరుకున్న సిబిఐ అధికారులు అయనతో మాట్లాడారు. ముగ్గురు సిబిఐ అధికారుల వెంట గోదావరిఖని ఏసిపి మడత రమేష్ వున్నారు.

## నెల్లూరు నగరంలోని గుర్రాలు మడుగు ప్రాంతంలో మృతదేహాలతో రోడ్డుపై బైఠాయింపు, తీవ్ర ఉద్రిక్త వాతావరణం..

నెల్లూరు జిల్లా .... సంగం మండలం పెరమన వద్దఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం...
మృతుల కుటుంబాలకు అండగా సిపిఐ సిపిఎం నేతలు సంఘీభావం...
నెల్లూరు జిల్లాలో పోలీసులకు ఉన్న బాధ్యత ప్రజా ప్రతినిధులకు లేదా అంటూ నినాదాలు..
మృతుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా ప్రకటించే వరకు రోడ్డుపై నుండి కదిలేది లేదంటూ రోడ్డు పై బైఠాయింపు...
నెల్లూరు జిల్లా సంఘం మండలం పెరమన వద్ద కారును ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఏడు మంది మృతి చెందిన విషయం తెలిసిందే ఈ ఘటనకు సంబంధించి కొన్ని కుటుంబాలు ఇందుకూరుపేట మరి కొంతమంది నెల్లూరు నగరంలోని గుర్రాలు మడుగు ప్రాంతానికి చెందిన వారని తెలిసిందే, ప్రమాదం జరిగి 24 గంటలు గడుస్తున్న ఇప్పటివరకు ప్రజాప్రతినిధులు కానీ ప్రభుత్వంగానీ బాధిత కుటుంబాలకు ఎక్స్గ్రేషియా ప్రకటించకపోవడంపై సిపిఎం సిపిఐ నాయకులు తీవ్రస్థాయిలో నిరసన మృతదేహాలను ఖననం చేసేది లేదంటూ రోడ్డుపై బైఠాయింపు, భారీగా పోలీసుల మొహరింపుతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది..

# ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతోనే ప్రజలకు కష్టాలు తలసాని

సికింద్రాబాద్. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం వల్లనే ప్రజలకు అవస్థలు పడాల్సి వస్తుందని సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. రాత్రి కురిసిన వర్షం కారణంగా వరద ముంపుకు గురైన మినిస్టర్ రోడ్ లోని కాచిబౌలి, నల్లగుట్ట ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించారు. ఇండ్లలోకి నీరు చేరి రాత్రంతా జాగారం చేసిన బస్తీల ప్రజలు తమ అవస్థలు మాజీ మంత్రికి వెళ్లబోసుకున్నారు. వారికి ధైర్యం చెప్పిన తలసాని వారికి అన్ని విధాలా అండగా  ఉంటామని హామినిచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైన జాగ్రత్తలు చేపట్టలేదని జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న నాలాల్లో  ఎక్కడి చెత్త అక్కడే ఉండడం శోచనీయమన్నారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా పర్యటించి నాలాల్లో పూడిక తొలగింపు విషయంలో  సమీక్ష జరపాలని సూచించారు.

# పలు కాలనీలను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్



సికింద్రాబాద్ కంటోన్మెంట్.. నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి కంటోన్మెంట్ నియోజకవర్గంలో దెబ్బతిన్న పలు కాలనీలను,బస్తీలను ఎమ్మెల్యే శ్రీగణేష్ పరిశీలించి బాధితులకు భరోసా ఇచ్చారు.

ముఖ్యంగా నియోజకవర్గంలోని 150 డివిజన్ అంబేద్కర్ నగర్,వార్డు5 ఏఓసి అపార్ట్మెంట్ రెసిడెన్స్,వాసవి కాలనీ,గృహలక్ష్మి కాలనీ, వార్డు4 లక్ష్మీ నగర్,పికెట్ సుబ్బారావు కాలనీలు వర్షానికి బాగా దెబ్బతిన్నాయి.

కాలం చెల్లిన నాలాల్లో నిన్నటి వర్షానికి మరింత దెబ్బతిన్నాయి,కాలనీలలోని ఇండ్లలోకి,అపార్టు మెంట్ సెల్లార్ లలోకి నీరు చేరి వాహనాలు తెగిపోయాయి, కాలనీ,బస్తీ రోడ్లు గుంతలతో స్వాగతం పలుకుతున్నాయి. ఇసుక,మట్టి రోడ్ల మీద చేరడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు.

నియోజకవర్గంలో పలు ప్రాంతాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ తిరుమల గిరి ఎమ్మార్వో బిక్షపతి తో పాటు సిబ్బంది  కలిసి దెబ్బతిన్న నాలాలు, రోడ్లను పరిశీలించారు. ఇండ్లలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న బాధితుల ఇండ్లను కూడా పరిశీలించారు.  ప్రజలతో మాట్లాడి వారి బాధలను తెలుసుకున్నారు.  పరిస్థితిని సమీక్షించి  అధికారులతో మాట్లాడారు. త్వరలోనే పరిస్థితిని బాగు చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు ఎమ్మెల్యే.

# విజయవాడ ఉత్సవ్ గొల్లపూడి ఎక్స్ -పో లో ఎడ్యుకేషన్ పెవిలియన్ ఏర్పాటు



విజయవాడఎడ్యుకేషన్ పెవిలియన్ ఏర్పాటు పై విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు మీడియా తో మాట్లాడారు.

ఎడ్యుకేషన్ పెవిలియన్ గురించి విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు అనిల్ సుంకర, అరసవిల్లి అరవింద్ తరుపున ఎక్సెల్లా డైరెక్టర్ గొల్లా శేఖర్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు ఎ.వో ఎస్.కె.పి.వి.వి హైస్కూల్ కమిటీ డాక్టర్ వి.నారాయణ రావు, కె.బి.ఎన్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు వివరాలు తెలిపారు.

×విజయవాడలో గత పన్నెండేళ్లుగా ఎగ్జిబిషన్ నిర్వహించటం లేదు. దసరా ఉత్సవాల సందర్భంగా గొల్లపూడి లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నాము. ఈ ఎగ్జిబిషన్ లో విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నాం. × ఏ దేశంలో ఎలాంటి కోర్సులు అందిస్తున్నారనే సమాచారం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఎడ్యుకేషన్ పెవిలియన్  ఏర్పాటు చేసాం. ఎడ్యుకేషన్ పెవిలియన్ లో ఎడ్యుకేషన్ స్టాల్స్ వుంటాయి. ఈ ఎడ్యుకేషన్ పెవిలియన్ కి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల  యూకే డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ముఖ్యఅతిథిగా రానున్నారు. ఎడ్యుకేషన్ పెవిలియన్ లో దేశ విదేశాలకు చెందిన ప్రముఖ యూనివర్శిటీలు పాల్గొంటాయి ×పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా ఈ ఎక్స్ పో వుంటుంది.
×విద్యార్థులు , తల్లిదండ్రులకు గొల్లపూడి ఎక్స్ పో లో నిర్వహించే ఎడ్యుకేషనల్ పెవిలియన్ మంచి సదావకాశం.  ఈ ఎడ్యుకేషనల్ పెవిలియన్ కి హాజరైతే విద్యార్థులు వారి భవిష్యత్తుకి సంబంధించి మంచి నిర్ణయం తీసుకొనే వీలు ఉంటుంది.  ×విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి విజయవాడ, చుట్టుపక్కల ఉన్న ఇంజనీరింగ్ కాలేజ్ లకు ఆహ్వానం పలుకుతున్నామని అన్నారు.

# బీఏసీలో సమావేశంలో కీలక నిర్ణయాలు



అమరావతి రాష్ట్ర శాసనసభ ఆవరణలో గురువారం జరిగిన బీఏసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 20, 21, 28 తేదీల్లో అసెంబ్లీ సెలవు.. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరపాలని బీఏసీలో నిర్ణయించారు. సభలో చర్చించేందుకు 18 అంశాలు టీడీపీ ప్రతిపాదించింది. సభలో చర్చించేందుకు 9 అంశాలు బీజేపీ ప్రతిపాదించింది. ప్రశ్నోత్తరాలతో పాటు శూన్య గంటలోనూ మంత్రులు ఉండాని సీఎం చంద్రబాబు అన్నారు. జలవనరుల అంశంపై రేపు శాసనసభలో చర్చ.. ఈ నెల 22న శాంతి భద్రతలు, 23న వైద్యారోగ్యంపై చర్చ. ఈ నెల 24న పరిశ్రమలు, 25న సూపర్‘6పై చర్చ.. ఈ నెల 26న క్వాంటం వ్యాలీ, 27న లాజిస్టిక్స్పై చర్చ జరగనుంది.

## భద్రాద్రి జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన
## పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విస్తృతంగా పర్యటించారు. కలెక్టరేట్లో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. 1948 సెప్టెంబర్ 17న నిరంకుశ పాలన నుండి ప్రజా పాలనకు అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అనంతరం ములకలపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం. వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఎస్పీ రోహిత్ రాజు,ఐటీడీఏ పీవో రాహుల్ తో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు కలిసి సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారి ఆరోగ్య సంరక్షణపై సమీక్షించారు. విద్యార్థుల కోసం డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. ‘స్వస్థ నారీ, సశక్త పరివార్ అభియాన్’ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెల్త్ కార్డులు ఇస్తారని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# గ్రేటర్ హైదరాబాద్ లో పౌర సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## బంజారాహిల్స్ డివిజన్ లో రూ.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:

హైదరాబాద్, సెప్టెంబర్ 18, 2025:గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పౌర సదుపాయాల పెంపుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్ లో ఎన్ బీ టీ నగర్, ఎమ్మెల్యే కాలనీ, ఎన్ బీ నగర్, మహేశ్వర్ కాంప్లెక్స్ లో రూ.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం శంకుస్థాపన చేశారు.

రూ.13 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులు, రూ.10 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న మురుగునీటి లైన్ పునర్నిర్మాణం , రూ.25 లక్షలతో ఎమ్మెల్యే కాలనీలో చేపట్టనున్న జీహెచ్ఎంసీ పార్క్‌లో యోగా సెంటర్ షెడ్ నిర్మాణం, రూ.29 లక్షలతో ఎన్ బి నగర్ రోడ్ నంబర్ 12 వద్ద చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులు, రూ.42 లక్షలతో మహేశ్వర టవర్స్, రోడ్ నంబర్ 1 %ు% 12 వద్ద చేపట్టనున్న వాటర్ లైన్ అభివృద్ధి పనులు వీటిలో ఉన్నాయి.




ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..

పౌర సదుపాయాలను మరింత అభివృద్ధి చేస్తూనే నగరంలో త్రాగునీటి సరఫరాలో క్షేత్ర స్థాయి అడ్డంకులు, సీవరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు.

యోగ పార్క్ కమ్యూనిటీ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించుకు ఉపకరిస్తుందని మేయర్ తెలిపారు.

కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే జీహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్

## ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తున్న స్వీప్ కార్యకలాపాలు ఓటరుగా నమోదు, ఓటింగ్ శాతం పెంచేలా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్, సెప్టెంబర్ 18, 2025:ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదేనని జీహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ అన్నారు.

జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల త్వరలో జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మార్గదర్శనంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్వీప్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి.

యువతను ఓటరుగా నమోదు చేయించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని మరింత పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేశారు.

ఈ క్రమంలో గురువారం ఎర్రగడ్డలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో డా. వివేకానంద్ మాట్లాడారు.




ఎన్నికలలో ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం బలపడుతుందని చెప్పారు.

నియోజకవర్గంలో జూలై 1, 2025 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొంటే రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛత, పారదర్శకత పెరుగుతుందని

జీహెచ్ఎంసి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, స్వీప్ సహాయ నోడల్ అధికారి డా. వివేకానంద్ చెప్పారు.

కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజశేఖర్, సి.ఓ వెంకటయ్య, శోభారాణి, రిసోర్స్ పర్సన్ లు రామలక్ష్మి , మహమ్మద్ గౌస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బాగ్ లింగంపల్లిలో వర్షం కష్టాలు



హైదరాబాద్ కుండపోత వర్షంతో ముషీరాబాద్ నియోజకవర్గం, రాంనగర్ డివిజన్, బాగ్ లింగంపల్లి లోని బృందావన్ కాలనీ వాసులు నడుము లోటు వర్షపు నీటి ప్రవాహంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని, సంబంధిత జీహెచ్ఎంసి, హైడ్రా, రెవిన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావడంతో జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ శ్ రామానుజ రెడ్డి బృందావన్ కాలనీ లో పర్యటించి కాలనీ వాసులతో వారి సమస్య గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది.

గత వరం రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పరిసర ప్రాంతాలలోని వర్షపు నీరు బృందావన్ కాలనీ లోని సెంట్ గాబ్రియేల్ ఉన్నత పాఠశాల వీధిలోకి ప్రవహించి ఇండ్లల్లో నడుములోతు వర్షపు నీటిలో నివాసితులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, కాలనీ లో పాఠశాల ఎదురుగా ఉన్న పోచమ్మ దేవస్థానంలో బాటు, తమ ఇండ్లలోని నిత్యావసర సరుకులు సైతం వర్షపు నీటిలో మునిగిపోయాయని, తమ సమస్యకు వెంటనే పరిష్కారం చూపించాలని కాలనీ వాసులు జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ కి తమ గోడు వెళ్లబోసుకోవడం జరిగింది. జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రామానుజ రెడ్డి ఈ సమస్యను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది.

# గ్రామీణ క్రీడాప్రతిభను గుర్తిస్తాం-ప్రోత్సహిస్తాం

## సీఎం కప్ 2025 నిర్వహణలో అందరినీ భాగస్వామ్యం చేస్తాం
## పండుగ వాతావరణంలా క్రీడాజ్యోతి ర్యాలీలు
## క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
## జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం




హైదరాబాద్ సెప్టెంబర్ 18 గ్రామీణ క్రీడాకారుల ఉత్సాహానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా సీఎం కప్ 2025 నిర్వహిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

ఈరోజు గచ్చిబౌలి స్టేడియంలో ఆయన జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులు, మరియు క్రీడా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కప్ 2024మాదిరిగానే సీఎం కప్ 2025 కూడా గ్రామీణ స్థాయి నుంచి నిర్వహిస్తామని,

గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం అందులో భాగస్వామ్యం చేస్తామని ఆయన తెలిపారు.

సీఎం కప్ 2025 నిర్వహణ మొక్కుబడిగా నామమాత్రంగా నిర్వహించకుండా, అందరు ప్రజాప్రతినిధులను మరియు అధికారులను ఇందులో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు.

ఇందులో ఎటువంటి పార్టీ భేదాలు లేకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా స్వయంగా మాట్లాడడం లేఖలు రాసి వారి సహాయాన్ని కోరుతామని, జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన తెలిపారు.

జిల్లాలో పరిపాలనపరంగా క్రీడా శాఖలో కొన్ని ఇబ్బందులు ఉన్నా సీఎం కప్ నిర్వహణకు చిత్తశుద్ధితో ఉత్సాహంతో కృషి చేస్తున్న అధికారులను ఆయన అభినందించారు.

సీఎం క పోటీలను కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం చేయకుండా ప్రతి ఉమ్మడి జిల్లాల్లో ఆయా జిల్లాల్లో ప్రాచుర్యం ఉన్న క్రీడాంశాలలో పోటీలు అన్ని జిల్లాల లో ఒక పండుగ వాతావరణం తెచ్చేలా నిర్వహిస్తామని తెలిపారు.

కేవలం పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడాకారుడి సమాచారాన్ని నిక్షిప్తం చేసి ప్రతిభ కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం కప్ విజయవంతానికి పీఈటీలు ఫిజికల్ డైరెక్టర్ల సహకారం తీసుకోవాలని అన్ని క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు.

సంకల్పబలం గట్టిదైతే ఏ పనైనా సాధించవచ్చని, సీఎం రేవంత్ రెడ్డి గారు క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహానికి క్రీడా శాఖ అధికారులు చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో కృషి చేస్తే అంచలంచలుగా క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

సీఎం కప్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు భవిష్యత్తు క్రీడా అవకాశాల్లో మంచి స్థానం ఇస్తామని, సీఎం కప్ సర్టిఫికెట్లకు ప్రభుత్వం కల్పించే విద్య ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత దక్కేలా

చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వహణ వాటి ఆశయాన్ని లక్ష్యాలను గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం చేసేందుకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో క్రీడాజ్యోతి కార్యక్రమాలు నిర్వహించి అందులో క్రీడాకారులు క్రీడాభిమానులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని డి వై ఎస్ ఓ లను కోరారు.

సీఎం కప్పోటీల తేదీలు మరియు క్రీడాజ్యోతి ర్యాలీ తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు జరిగే ఈ పోటీలలో అన్ని స్థాయిల్లో విజయవంతం చేసిన ఐదు జిల్లాలను ఎంపిక చేసి వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. ఆదేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారి పట్ల కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వాహణలో క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయాలని, సూచించారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు కోచులు పాల్గొన్నారు.

# గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవ కమిటీకి ప్రాజెక్ట్ కన్వీనర్ పురం వెంకటేశం గుప్తా



హైదరాబాద్ సెప్టెంబర్ 18 గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవ కమిటీ తరపున, 2025-2026 సంవత్సరానికి లక్ష గాంధీ విగ్రహాల తయారీ, ప్రదర్శన మరియు పంపిణీ మరియు వివిధ సంస్థలతో నిధుల సేకరణకు మద్దతు తీసుకోవడం కోసం ప్రాజెక్ట్ కన్వీనర్ గా నల్ల కుంటకు చెందిన పురం వెంకటేశం గుప్తాను నియమించారు.ఈ మేరకు గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసారు.%వవ% సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవ వేడుకల విజయంలో కీలక పాత్ర పోషించాలని, విధులను మరియు బాధ్యతలను గాంధీ విలువలకు నిజాయితీ అంకితభావం మరియు నిబద్ధతతో నిర్వర్తిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

# మానవత్వాన్ని చాటుకున్న కాంటెస్టెడ్ కార్పొరేటర్ డాక్టర్ బత్తుల ఓం ప్రకాష్ శిరీష



హైదరాబాద్ సెప్టెంబర్ 18 సమాజంలో నేడు అనాధలకు ఆర్తులకు నేనున్నా అనే భరోసా ఇచ్చేవారు అరుదు.ఇలాంటి తరుణంలో కాచిగూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసిన కాంటెస్ట్ కార్పొరేటర్ అయిన డాక్టర్ బద్దుల ఓం ప్రకాష్ శిరీష దంపతులు డయాలసిస్ తో బాధపడుతున్న ఒక సీనియర్ పాత్రికేయుడైన అవినాష్ విషయం తెలుసుకున్న వారు తమకు తోచిన సాయం సహకారాలు అందిస్తూ మేమున్నాము నీకు అన్న బరోసా కల్పించారు. పాత్రికేయులంటేనే పట్టించుకోని నేటి సమాజంలో ఒక పేద పాత్రికేయుడిని గుర్తించి సహాయ సహకారాలు అందిస్తూ పాత్రి కుటుంబానికి ఆదుకోవడాన్ని పలువురు అభినందిస్తున్నారు. వీరిసహాయానికి వెలకట్టలేని చెప్పవచ్చు వీరికి ఏమిచ్చి నా ఋణం తీర్చుకోలేనిదని అవినాష్ కుటుంబం కంట తడి పెట్టింది. వృత్తిరీత్యా శిరీష డాక్టర్ అయి ఉండి ప్రతి ఒక్క సమస్యను వారి సమస్యగా భావించి చేదదీర్చడం ఆ భగవంతుడి ఆమెకు ఇచ్చిన వరం అని చెప్పవచ్చు.

# పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**సెప్టెంబర్ 18, 2025-నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా అవసరమైనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర (%మీరా%) కింద తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పత్తి మార్కెటింగ్ సీజన్ 2025-26లో జిల్లా సగటు దిగుబడి అంచనాకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కమిటీ మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా ఉత్పత్తి వివరాలు సేకరించి వాస్తవికంగా సగటు దిగుబడిని లెక్కించనుందని తెలిపారు. రాష్ట్ర సగటు కంటే 10శాతం మించితే ప్రత్యేక ధ్రువీకరణతో మాత్రమే ఆమోదం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు సహకరించి కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సిపిఓ జీవరత్నం, ఎడి మార్కెటింగ్ గజానన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డిఎస్ఓ రాజేందర్, డిఎం సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ లో ఉత్తీర్ణత మరింత పెరగాలి

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలి

అన్ అకాడమీ క్లాసెస్ సద్వినియోగం చేసుకోవాలి

యూ డైస్, ఎఫ్ ఆర్ ఎస్ పూర్తి చేయాలి

రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ఇంటర్ విద్య పై జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల సంక్షేమ,ఇతర కళాశాలలపై సమీక్ష సమావేశం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, సెప్టెంబర్ - 18 (ప్రజా బలం ప్రతినిధి)**జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత మరింత పెరగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్య, రానున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం, వివిధ అంశాలపై జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, సోషల్, బీసీ, ట్రైబల్, మైనార్టీ సంక్షేమ కళాశాలలు, టీజీ రెసిడెన్షియల్, మోడల్ స్కూల్, కేజీబీవీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ముందుగా జిల్లాలో ఎన్ని ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి? ఎందరు విద్యార్థులు చదువుతున్నారో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిని ఆరా తీయగా, మొత్తం 42 ప్రభుత్వ, 06 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 4302, సెకండ్ ఇయర్ లో 3874 మంది మొత్తం 8176 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ దృష్టికి డీఐఈఓ తీసుకెళ్లారు.

అనంతరం అన్ని కళాశాలల్లో గత ఏడాది ఎంత మంది విద్యార్థులు పాస్ అయ్యారో.. కళాశాల వారిగా సమీక్షించారు. ఉత్తీర్ణత తక్కువ ఉన్న కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో





యూ డైస్, ఎఫ్ ఆర్ ఎస్ వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని రెసిడెన్షియల్ కళాశాలల్లో ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని సబ్జెక్టులపై పట్టు వచ్చేలా తీర్చిదిద్దాలని, గత ప్రశ్న పత్రాలు తీసుకొని విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని, అన్ అకాడమీ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి ప్రతి కళాశాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. అటవీ జంతువులు, కోతులతో ఇబ్బందులు ఎదురవుతున్న విద్యాలయాల బాధ్యులు సోలార్ ఫెన్సింగ్ కోసం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అవసరమైన మేర వాటిని అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీనివాస్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# మురికి నీరును తొలగించిన కార్పొరేటర్ చామకూరి వెంకట్ నారాయణ



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ దగ్గర ఉండి డివిజన్ లోని అల్లిపురం మెయిన్ రోడ్డు నందు ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురికి నీటిని జెసిపి సాయంతో కచ్చా కాలువలు కొట్టించి తొలగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శంకర్, జవాన్ నాగరాజు పాషా నర్సిరెడ్డి, భాస్కర్, బాల, శివరాం శ్యామల రాజు వరికోటి భాస్కర్, విజయలక్ష్మి, కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

# భూపాలపల్లి పట్టణాన్ని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర భూపాలపల్లి ప్రజాబలం ప్రతినిధి:**గురువారం మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ దసరా పండుగల ఏర్పాట్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇంటింటి నుండి వ్యర్థాలు సేకరణ, స్వచ్ఛ వాహనాలను జిపిఎస్ ట్రాక్టర్ ద్వారా పర్యవేక్షణ, సిబ్బంది సమయపాలన, ఖాళీ ఇంటి స్థలాలు పరిశుభ్రంగా ఉంచడం, వన మహోత్సవంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ, ప్రధాన రహదారి డివైడర్ లో మొక్కలు సంరక్షణ, వ్యర్థాలు నుండి వర్మీ తయారు, చిన్నారుల పార్కు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పక ప్రతి ఇంటి నుండి వ్యర్థాలు సేకరణ జరగాలని వార్డు అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక ఫోకస్ చేయాలని సూచించారు. వార్డు అధికారులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీ సైక్లింగ్ వస్తువులు విక్రయాలు, తడి చెత్తను వర్మీ తయారు చేసి మొక్కలకు వినియోగించడం, విక్రయాలు ద్వారా ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డివైడర్ లో నాటిన మొక్కలు వంగిపోకుండా సపోర్ట్ గా కర్రలు పెట్టాలని అన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయాలని, పంపిణీ వివరాలు రిజిస్టర్ లో నమోదులు చేయాలని తెలిపారు. ఖాళీగానున్న ఇంటి స్థలాలు పరిశుభ్రం చేయాల్సిన బాధ్యత స్థల యజమానులదేనని అలాంటి స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, నిర్దేశించిన సమయంలో పరిశుభ్రం చేయకపోతే



మున్సిపాలిటీ నుండి పరిశుభ్రం చేపించి జరిమానా విధించాలని స్పష్టం చేశారు. దుకాణాల ముందు వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలు వేస్తే జరిమానా విధించాలని తెలిపారు. మాంసాహార దుకాణాల నుండి వ్యర్థాలు ఆరుబయట వేయకుండా అవగాహన కల్పించాలని, రహదారుల వెంబడి, ఆరుబయట వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాలను గుర్తించి వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగాహన కొరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంటి పన్నులు వసూళ్లు నూరు శాతం జరగాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలో చిన్నారుల కోసం పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనతరం నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం, ఆడిటోరియం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని, ప్రహరి నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు వార్డుల వారీగా సక్రమమైన ఏర్పాట్లు చేయాలని వార్డు అధికారులను ఆదేశించారు.

ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాల్లో మహిళలు బతుకమ్మలు ఆడే ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య కార్యక్రమాలు, విద్యుత్ సౌకార్యం కల్పించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా ఘాట్ వద్ద ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. 30వ తేదీన జరిగే సద్దుల బతుకమ్మ, 2వ తేదీన జరిగే దసరా వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఏ ఈ మానస, డిపిఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి కలెక్టర్ మను చౌదరి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సెప్టెంబర్ 18:**తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కం కాలేజ్ గర్ల్స్ భవన నిర్మాణం పనులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పూర్తి చేయాలని,సంబంధిత అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ మండలంలోని సోమవారం గ్రామంలో నిర్మిస్తున్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజ్ భవన నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు ఎంతవరకు పూర్తయ్యాయని,ఇంకా ఎన్ని రోజులలో పూర్తవుతుందని ఏ ఏ పనులు పెండింగ్లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని సూచించారు. డార్మెంటరీ తరగతి గదులు కిచెన్ టాయిలెట్స్ వంటి వాటిని ముందుగా పూర్తి చేసుకుని వినియోగించుకోవాలని ఆదేశించారు.

బోడుప్పల్ లో ప్రైవేటు బిల్డింగ్ లో నిర్వహిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను దసరా సెలవుల లోపు తరలించాలని ఆర్సిఓను ఆదేశించారు. నిర్మాణ పనులను చేపట్టాలని అత్యవసరమైన వాటిని ముందుగా పూర్తి చేసుకుని భవనాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మొత్తము ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదనంగా అవసరమైన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మార్వో భూపాల్ ఆర్ సి ఓ నాగార్జున ప్రిన్సిపల్ మమత తదితరులు పాల్గొన్నారు.



# ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నాలాల్లో మాత్రం ఎక్కడి పూడిక అక్కడే ఉంటుంది





సనత్ నగర్. (ప్రజాబలం ప్రతినిధి )సెప్టెంబర్ 18 ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నాలాల్లో మాత్రం ఎక్కడి పూడిక అక్కడే అన్నట్లు ఉన్నదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మినిస్టర్ రోడ్ లో భారీ వర్షంతో ముంపుకు గురైన కాచి బౌలి, జూలమ్మ టెంపుల్, నల్లగుట్ట ప్రాంతాలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాల్లో ఎక్కడ చూసినా పూడిక తొలగించిన ఆనవాళ్ళు కనిపించడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే దీనికి కారణం అని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ శాఖ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే ఉన్నందున నాలాల్లో పూడిక తొలగింపు విషయంలో పూర్తిస్థాయి సమీక్ష జరిపారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. పూడిక తొలగింపుకు సంబంధించి ఇచ్చిన మంజూరు, జరిగిన పనుల తీరు పై క్షేత్రస్థాయిలో నివేదికలు తెప్పించుకుంటే వాస్తవాలు వెల్లడి అవుతాయని ఆయన చెప్పారు. వర్షాలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేయడం కాదని, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉన్నదని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం..ప్రజలకు అవస్థలు భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ హైడ్రా, GHMC అధికారులు అవసరమైన జాగ్రత్తలు చేపట్టని కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రాంగోపాల్ పేట డివిజన్ లోని మినిస్టర్ రోడ్ లో గల కాచిబౌలి, నల్లగుట్ట, జూలమ్మ దేవాలయం తదితర ప్రాంతాలు ముంపుకు గురై ఇండ్లలోకి నీరు చేరాయి. గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పర్యటించి బాధితులను పరామర్శించి అండగా ఉంటి ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. ఇంకా పలు ఇండ్లలో వర్షపు నీరు ఉన్నది. రోడ్లు బురదమయంగా ఉన్నాయి. రాత్రంతా తాము జాగారం చేశామని ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే కు విన్నవించారు. కాచి బౌలి లోని నాలాను పరిశీలించగా అందులో ఉన్న వ్యర్థాలను చూసి ఎందుకు పూడిక తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో పూడిక తొలగించకపోవడం వలనే నీరు సక్రమంగా వెళ్లక సమీపంలో ఉన్న ఇండ్లలోకి, కాలనీలలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. వెంటనే నాలాలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని, నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నాలా కు సమీపంలో చెత్త కుప్పలు కనిపించగా, తరలించే విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని శానిటేషన్ అధికారిని ప్రశ్నించారు. వర్షాకాలంలో చెత్తను తొలగించకుండా ఉంచితే ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, %ఱఱ% దాకు నాయక్, %ఱు% సుబ్రహ్మణ్యం, %ఱు% మహేష్, శానిటేషన్ %ఱఱ% వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, మహేష్ యాదవ్, మహేందర్, అరుణ్ భట్, గణేష్, చంద్ర ప్రకాశ్ తదితరులు ఉన్నారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నాలాల్లో మాత్రం

ఎక్కడి పూడిక అక్కడే అన్నట్లు ఉన్నదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మినిస్టర్ రోడ్ లో భారీ వర్షంతో ముంపుకు గురైన కాచి బౌలి, జూలమ్మ టెంపుల్, నల్లగుట్ట ప్రాంతాలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాల్లో ఎక్కడ చూసినా పూడిక తొలగించిన ఆనవాళ్ళు కనిపించడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే దీనికి కారణం అని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ శాఖ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే ఉన్నందున నాలాల్లో పూడిక తొలగింపు విషయంలో పూర్తిస్థాయి సమీక్ష జరిపారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. పూడిక తొలగింపుకు సంబంధించి ఇచ్చిన మంజూరు, జరిగిన పనుల తీరు పై క్షేత్రస్థాయిలో నివేదికలు తెప్పించుకుంటే వాస్తవాలు వెల్లడి అవుతాయని ఆయన చెప్పారు. వర్షాలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేయడం కాదని, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉన్నదని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం..ప్రజలకు అవస్థలు భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ హైడ్రా, GHMC అధికారులు అవసరమైన జాగ్రత్తలు చేపట్టని కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రాంగోపాల్ పేట డివిజన్ లోని మినిస్టర్ రోడ్ లో గల కాచిబౌలి, నల్లగుట్ట, జూలమ్మ దేవాలయం తదితర ప్రాంతాలు ముంపుకు గురై ఇండ్లలోకి నీరు చేరాయి. గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పర్యటించి బాధితులను పరామర్శించి అండగా ఉంటి ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. ఇంకా పలు ఇండ్లలో వర్షపు నీరు ఉన్నది. రోడ్లు బురదమయంగా ఉన్నాయి. రాత్రంతా తాము జాగారం చేశామని ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే కు విన్నవించారు. కాచి బౌలి లోని నాలాను పరిశీలించగా అందులో ఉన్న వ్యర్థాలను చూసి ఎందుకు పూడిక తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో పూడిక తొలగించకపోవడం వలనే నీరు సక్రమంగా వెళ్లక సమీపంలో ఉన్న ఇండ్లలోకి, కాలనీలలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. వెంటనే నాలాలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకోవాలని, నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నాలా కు సమీపంలో చెత్త కుప్పలు కనిపించగా, తరలించే విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని శానిటేషన్ అధికారిని ప్రశ్నించారు. వర్షాకాలంలో చెత్తను తొలగించకుండా ఉంచితే ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, DC దాకు నాయక్, EE సుబ్రహ్మణ్యం, DE మహేష్, శానిటేషన్ DE వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, మహేష్ యాదవ్, మహేందర్, అరుణ్ భట్, గణేష్, చంద్ర ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## అడ్వాన్స్ ఆస్టియో ఆర్థరైటిస్తో బాధపడుతున్న 62 సంవత్సరాల వ్యక్తికి రోబోటిక్ ట్రైలేటరల్ మోకాలి మార్పిడి ద్వారా సరికొత్త జీవితాన్ని అందించిన యశోద హాస్పిటల్స్




ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) ఖమ్మం యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ చీఫ్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని మాట్లాడుతూ దీర్ఘకాలికంగా రెండు మోకాళ్లలో తీవ్రమైన ఆస్టియో ఆర్థరైటిస్తో బాధపడుతున్న కందికట్లకు చెందిన 62 ఏళ్ల పురుషుడు శ్రీ లెనిన్ బాబు రాయల ద్విపార్శ్వ రోబోటిక్ టోటల్ నీ రీప్లేస్మెంట్ విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక ద్విపార్శ్వ మోకాలి నొప్పి కీళ్ల దృఢత్వం మరియు నడవడానికి ఇబ్బంది వంటి సమస్యలతో శ్రీ లెనిన్ బాబు యశోద హాస్పిటల్ కు వచ్చారని ఇది అతని రోజువారీ కార్యకలాపాలను గణనీయంగా ప్రభావితం చేసిందని క్లినికల్ పరీక్షలు మరియు డయాగ్నస్టిక్ ఇమేజింగ్ రెండు మోకాళ్లలో అధునాతన ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు నిర్ధారించాయి , దీనితో ఆయనకు రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ అవసరమని డాక్టర్లు నిర్ధారించి ఈ ప్రక్రియను జూన్ 24 2025న చీఫ్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని మరియు బృంద సభ్యులైన కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా %ఆ% రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ రవీష్ అజ్మీరా అధునాతన స్మిత్ మరియు నెఫ్యూ కోరి రోబోటిక్ సిస్టమ్ ను ఉపయోగించి ఉన్నతమైన మన్నిక మరియు తక్కువ బరువు కలిగిన ఆక్సీనియం ప్రొస్థెసిస్ ఇంప్లాంట్లను ఈ సర్జరీలో ఉపయోగించారు అని అన్నారు "రోబోటిక్ కీళ్ల మార్పిడి బోన్ కట్స్ మరియు అమరికలో గతంలో ఎన్నడూ లేనంత ఖచ్చితంగా చేయడానికి వీలవుతుందని ఇది కీళ్ల జీవితకాలం మరియు రోగి జీవనశైలిని మెరుగుపరచడంలో కీలకం (శ్రీ లెనిన్ బాబు కేసు ఆధునిక పద్ధతులు ముందస్తు రోగ నిర్ధారణ మరియు నిపుణుల సంరక్షణతో కలిపితే తిరిగి నడవడం మరియు జీవన నాణ్యతను అత్యుత్తమంగా ఎలా పునరుద్ధరించగలవో రుజువు చేస్తుందని యశోద హాస్పిటల్స్ హిప్ %ఆ% మోకాలి రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్. ఉదయ్ కృష్ణ మైనేని %మీ%, విజు% (ఆర్థో, %ఖు%) మరియు బృంద సభ్యులైన కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ ట్రామా మరియు రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్. రవీష్ అజ్మీరా లు అన్నారు . సర్జరీ తర్వాత పేషెంట్ కు క్వాడ్సెప్స్ మరియు హామ్ స్ట్రింగ్ బలోపేతం మోకాలి రోమ్ వ్యాయామాలు మరియు వాకర్ సహాయంతో నడిపించడం జరిగిందని మరియు అంకితమైన ఫిజియోథెరపీ లభించింది వీటి వలన త్వరగా లేచి నడవడమే కాకుండా అత్యంత తక్కువ సమయంలోనే నొప్పి కూడా తగ్గడంతో ఆరోగ్యమైన స్థితిలో అతను డిశ్చార్జ్ చేయబడ్డారు . విజయవంతంగా నిర్వహించిన ఈ సర్జరీ ఆర్థోపెడిక్ విభాగంలో యశోద హాస్పిటల్స్ యొక్క నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది కీళ్ల రుగ్మతలతో బాధపడుతున్న పేషెంట్లకు రోబోటిక్ సర్జరీ కంప్యూటర్ నావిగేషన్ వంటి అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుంది . గత 30 సంవత్సరాలుగా హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 4 బ్రాంచ్ లు ( సికింద్రాబాద్ , సోమాజిగూడ , మలక్ పేట్ హైటెక్ సిటీ ) 4 వేల పడకలు కలిగి ఉన్న అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ . వైద్య అవసరాలకు అనుగుణంగా అనుభవంతులైన వైద్యులచే అధునాతన సాంకేతికతలతో ఇప్పుడు అందరికి చేరువలో కార్పొరేట్ వైద్య సేవలు చురుకైన నాయకత్వం మరియు బలమైన నిర్వహణ వైద్య చికిత్సలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను అందించే అత్యుత్తమ కేంద్రంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అభివృద్ధి చెందింది పేషంట్ అవసరాలకు అనుగుణంగా అనునిత్యం మార్గనిర్దేశం చేయబడుతుంది . అరుదైన మరియు సంక్లిష్టమైన విధానాలకు కూడా సంపూర్ణ మిళిత విప్లవాత్మక సాంకేతికత ద్వారా చికిత్సలను అందిస్తుంది యశోద గ్రూప్ మెడిసిన్ మరియు సర్జరీకి సంబంధించిన ప్రతి స్పెషాలిటీ మరియు సబ్ స్పెషాలిటీలో అధునాతన రోగనిర్ధారణ మరియు చికిత్సా సంరక్షణను అందించడం ద్వారా వైద్య నైపుణ్యం మరియు అధునాతన విధానాలను నిర్వహిస్తుంది . భారతదేశంలోనే అతిపెద్ద వైద్య సదుపాయాలలో ఒకటిగా భావిస్తున్న తెలంగాణలోని హైదరాబాద్లో 4000 పడకల సామర్థ్యంతో 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉండి సరసమైన ఖర్చులతో యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుందని డాక్టర్లు తెలిపారు

## వికారాబాద్ జిల్లా లో ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.



వికారాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి: గురువారము రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నందున పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. ముందుగా పోలీస్ వారి చే గౌరవ వందనం స్వీకరించారు .

అనంతరము జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ప్రతీక్ జైన్ , జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి , అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ల తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల వారితో మాట్లాడారు. బి ఎల్ ఓ ల పేర్లు ఇచ్చారా?, ఓటరు జాబితా పూర్తి అయినదా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డి ఆర్ ఓ మంగీ లాల్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతి నిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# తెల్లవారుజాము నుండి అక్రమించుకుందాం

### సాండ్ బజార్లో ఇసుక మెత్తటిది దేనికి పనికిరాదు మేము మంచి ఇసుక తోలుతాం అంటున్న ఇసుక దళారులు

### అధికారుల పర్యవేక్షణ లోపమా ఇంకేమైనా కారణమా





మధిర నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) మధిర పట్టణంలోని రాయపట్నం రేవు నుండి ఇసుక అక్రమ రవాణా గురువారం తెల్లవారుజాము నుండి జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం ఇందిర మహిళలకు మిగతా కట్టుబల్లకు మార్కెట్ యార్డ్ లో చవకగా సాండ్ బజార్ ఓపెన్ చేసినప్పటికీ ఇసుక దందా యాధృచ్ఛికంగా జరగడం పలు అనుమానాలకు దావితీస్తుంది. ముఖ్యంగా కూపన్ లేకుండా తెల్లవారుజామున నుండి పలు ట్రాక్టర్లు రేవు నుంచి ఇసుక అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులకు తెలుసా తెలియదా అనేక అనుమానాలు ప్రజలలో వ్యక్తం అవుతున్నాయి. పలుమార్లు ఇసుక అక్రమ రవాణా పై కంప్లైంట్ లు ఇచ్చినప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరగడం వెనుక కారణాలు లేవా ఇంకేమైనా ఉన్నాయా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా దృశ్య సారించి కూపన్ లేకుండా తిరుగుతున్న అక్రమ ఇసుక ట్రాక్టర్లను సీజేసి భారీ జరిమానా విధించి మరొకసారి అక్రమ ఇసుక రవాణా చేయాలంటే భయం వేస్తుంది

## నేడు చలో హైదరాబాద్ లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలి రావాలి

### బంజారా అడ్వకేట్ జెఏసి నాయకులు హరినాయక్




**ఖమ్మం సెప్టెంబర్ 18 (ప్రజాబలం బ్యూరో)** ఓయూ విద్యార్థుల, లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19న శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు ఖమ్మం జిల్లా నుండి బంజారా బిడ్డలు భారీగా తరలి రావాలని బంజారా అడ్వకేట్ జెఏసి నాయకులు హరినాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ సభతో రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ప్రతి ఇంటికొక వ్యక్తి తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీల మధ్య కొంతమంది చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావ్‌పై చర్యలైనా తీసుకోవాలి లేదా సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకునేలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక జాతిపై ఘోరాతిఘోరమైన ఆరోపణలు జరుగుతుంటే ముఖ్యమంత్రి స్పందించకుండా చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. అందుకే ప్రతి తండాలో, ప్రతి గ్రామంలో బంజారాలను మేల్కొలిపేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే చొరవ తీసుకుని ఈ సున్నితమైన సమస్యను పరిష్కరించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఓట్లు మావి, సీట్లు మీవా అంటూ ప్రశ్నించారు. అందుకే తాము ఉద్యమ బాట పట్టామని, అందులో భాగంగా జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 28న మానుకోటలో జరుగనున్న సభనూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ధరావత్ వీరన్న, ధరావత్ ప్రసాద్, ధరావత్ ఉపేంద్రమ్మ, భూక్యా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## పుట్టగొడుగులను పెంచండి అధిక లాభాలు పొందండి

### పుల్కల్ ఎంపీడీవో ఆనంద్ మేరీ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** పుట్టగొడుగులను పెంచండి అధిక లాభాలు పొందండి అని, బుధవారం పుల్కల్ మండలం ఎంపీడీవో ఆనంద్ మేరీ, అన్నారు, పుల్కల్ మండలంలోని, ( ఐకెపి ) కార్యాలయంలో అటవీ జీవవైవిధ్య సంస్థ, దూలపల్లి, హైదరాబాద్ వారి సహకారంతో, పుట్టగొడుగుల పెంపకం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ప్రస్తుతం పుట్టగొడుగులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది, మరియు ఇది ఆరోగ్యకరమైన ఆహారం, కావున పుట్టగొడుగుల పెంపకం చేపట్టి, ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు, పుట్టగొడుగులు ఎలా పెంచాలి వాటికి సంబంధించిన శిక్షణ, మరియు వాటికి సంబంధించి మార్కెటింగ్



సౌకర్యం కూడా కల్పిస్తామని, తెలిపారు, పుట్టగొడుగులు పెంపకం ఏ విధంగా చేపట్టాలి అని, ప్రాక్టికల్గా శిక్షణ ఇవ్వడం జరిగింది, ఎంపీడీవో ఆనంద్ మేరీ, మాట్లాడుతూ, పుట్టగొడుగులకి మార్కెట్లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్నందున, వీటి శిక్షణ తీసుకొని పెంపకం చేపట్టితే, మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో జీవవైవిధ్య సంస్థ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, ( ఐ ఎఫ్ సీ ) సైంటిస్ట్ శ్రీకాంత్, సమస్త సిబ్బంది సాగర్,యశ్వంత్, మరియు శిక్షణ నిపుణులు, ( డిపిఎం )రమేష్ బాబు, శ్రీనిధి( ఆర్ఎం ) శ్రీనివాసు, ( ఏపీఎం ) చంద్రశేఖర్, ( ఏపీఓ) సంతోష్, మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక, ఐకెపి సీసీలు సిఐలు, మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.....

## ముంపు బారిన మంజీరా తీరం

### ఏటా మునుగుతున్న పంటలు నష్టపోతున్న రైతులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 ( ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా :** ఉమ్మడి పుల్కల్ మండలం, భారీ వర్షాల కారణంగా వరదలు రావడంతో, మంజీరా నది తీరం వెంబడి, పంటలు మునిగిపోయి రైతులకు నష్టం వాటిల్లింది, దీంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు, మంజీరా నది పరివాహకం, సారవంతమైన నేల కావడంతో పంటలు బాగా పండుతాయి అని, ఆశించిన రైతులను, వరదలు రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టాయి, సింగూరు ప్రాజెక్టుకు భారీ వరదలు రావడంతో, క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు వదలడం, ఆ నీరు మంజీరా బ్యారేజ్ గుండా దిగువకు సరాసరి పోకపోవడంతో, మంజీరా నది ప్రవాహం వెంబడి, నీరు నిలిచిపోయి పంటలు మునిగిపోయాయి, సింగూరు ప్రాజెక్టు దిగువ నుంచి మంజీరా బ్యారేజ్ వరకు 22,కిలోమీటర్ల పరివాహకం ఇరువైపులా వరదల వల్ల, పంటలు ముంపు బారిన పడుతున్నాయి, వరదలు వచ్చిన ప్రతిఏటా ఇక్కడ పంటలు మునిగిపోవడం సర్వసాధారణమైపోయింది, కావున ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలు మునిగిపోయి నష్టపోయిన మాకు ప్రభుత్వం గుర్తించి ఆదుకొని నష్టపరిహారం అందించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని అధికారులు వేడుకుంటున్నారు.

## భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తం

అదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాల తో జన జీవనం అస్తవ్యస్తమవుతుంది. వాగులు దాటేందుకు పడరానికష్టాలు పడుతున్నారు .. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం మత్తడిగూడ కు వెళ్లేందుకు వాగును దాటాలంటే సాహసమే చేయాలి.. గ్రామానికి చెందిన ఓ మహిళ మృతి చెందడంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు వచ్చిన బంధువులు వాగు దాటడానికి నానాయాతన పడ్డారు.. మత్తడి గూడ గ్రామంలో కుమ్ర పారుబాయి (45) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు బంధువులు గ్రామానికి వెళ్ళగా భారీ వర్షం కురవడంతో ఆ గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహించడం కారణంగా వర్షంలో గ్రామస్తులు ఒకరినొకరు పట్టుకొని వాగు దాటుతూ ఇబ్బందులు పడుతూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు..

## పిల్లిగుండ్ల నుండి అమ్రాదీ కుర్దు వరకు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

### వికారాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ సంజీవరెడ్డి





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18 ( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి / పిల్లిగుండ్ల నుండి చిన్న అమ్రాది కుర్దు, వెళ్లడానికి మరమ్మత్తులకు నోచుకోలేని రోడ్డు, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్డు , వర్షం పడిందంటే ప్రజల ఇబ్బందులు, చెప్ప నలవి కావు, వర్షం కురిసింది అంటే పెద్ద పెద్ద గుంతలు గుంతల్లో నీళ్లు, రోడ్డుపై రాళ్లు వీటితో నిత్యావస్థలు పడుతున్న గ్రామ ప్రజల ఇబ్బందులను గ్రహించి పిల్లిగుండ్ల, నుండి గుండ్ల మర్పల్లి ,బ్రిడ్జి వరకు వెంటనే రోడ్డు మరమ్మతులు ప్రారంభించాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు,1, కోటి 50, లక్షల రూపాయలు, రోడ్డు మరమ్మతులకు మంజూరు ఇచ్చిన ఘనత, మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదే మన ప్రియతమ నాయకులు వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ సభాపతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కృషితో నిధులు కేటాయించిన ఘనత, సభాపతి కృషి వళ్ళనే అయిందని వికారాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ సంజీవరెడ్డి, వ్యక్తపరిచారు, ముఖ్యంగా రోడ్డు మరమ్మతులకు టెండర్ దారులు నిర్లక్ష్య ధోరణి విడిచి వెంటనే పని ప్రారంభించాలని తెలిపారు, రాత్రి సమయంలో గ్రామానికి రావాలంటే గుంతల నిండా నీళ్లు ఉండడంతో అదుపుతప్పి ద్విచక్ర వాహనదారులు చాలామంది, క్రిందపడి గాయాలపాలై, ఆస్పత్రులకు డబ్బులు వెచ్చించుకుంటున్నారని ప్రజా సమస్యలు ప్రభుత్వమే తీర్చాలని ప్రజా క్షేమం కోసం ప్రభుత్వం వెంటనే టెండర్దారులును పిలిచి పనులు నిర్వహించాలని వికారాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ సంజీవరెడ్డి, తెలియజేశారు, ఈ రోడ్డు తీరును చూసి ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు,మరియు నాయకులు పెద్దలు తమ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.....

## పంచలింగాల్,ఎర్రబారిన తెల్ల బంగారం,అతివృష్టితో ఆగమైన రైతన్న

### రైతునడ్డి విరిచిన నకిలీ సీడ్స్ అంటున్నా రైతు రమేష్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 18( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి / మండల పరిధిలోని గ్రామాలలో ఎర్ర బారిన తెల్ల బంగారం చూసి అతివృష్టితో ఆగమైపోయిన రైతుకన్నీరు మున్నేరు పెట్టిన రైతన్న ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ తనిఖీలు చేస్తున్న నకిలీ విత్తనాలు అమ్మి రైతు నడ్డి విరిచిన వ్యాపారవేత్తలు అతివృష్టితో కొందరు రైతులు నష్టపోయారు నకిలీ విత్తనాలతో మరికొందరు నష్టపోయారని రైతులు ఆవేదన వ్యక్తపరిచారు రాజుల బ్రతికే రైతన్న నేడు గుండె నిండా గాయాలపాలై పంటను చూసి మానసికంగామనోవేదనతో గుండె చేరువైరోదిస్తున్న రైతన్న అతివృష్టి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలని ఆవేదన వ్యక్తపరిచారు కూలిపోయిన పంట మొక్కలను చూసి వాడిపోయిన మనసుతో రైతు గుండె నిండా బాధతో ఏం చేయలేని పరిస్థితిలో రైతన్న ఆవేదన ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని ఆ విధంగా వ్యక్తపరిచారు

## రాజన్న ఆలయ 29 రోజుల హుండీ లెక్కింపు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం రోజున 29 రోజుల హుండీ లెక్కింపు జరిగింది. ఇట్టి లెక్కింపులో నగదు రూపాయలు 1 కోటి,21 లక్షల,70 వేల,150 రూపాయలు.(1,21,70,150 రూపాయలు)

మిశ్రమ బంగారం:064 గ్రాముల 900 మిల్లి గ్రాములు.

మిశ్రమ వెండి :7 కిలోల 300 గ్రాములు.

హుండీ లెక్కింపు నందు కార్యనిర్వాహణాధికారి ఎల్. రమాదేవి, ఏసీ కార్యాలయ పరిశీలకులు, సత్యనారాయణ, ఏ ఈ ఓ లు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్ మరియు హొంగార్డు ఔట్సోర్సింగ్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చూశారు. ఇట్టి హుండీ లెక్కింపు నందు శ్రీ శివరామకృష్ణ భజన

## విలాసాగర్ గ్రామంలో కర్డెన్ సెర్చ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 18** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అక్రమంగా ఇసుక లోడ్ చేసిన 16 ట్రాక్టర్లను, సరైన పత్రాలు లేని 14 ట్రాక్టర్లను సీజ్ చేసి జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తే 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు .ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్, రూరల్ సీఐ లక్ష్మీనారాయణ,జమ్మికుంట ఎస్సై సతీష్, వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి, ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్, హుజరాబాద్ ఎస్ఐ రాధాకృష్ణ లతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# జన్మదినం సందర్భంగా రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది.



వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), గురువారం రోజున వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ కు పూలమాలవేసి అర్చకులు స్వస్తివచనంతో ఘనంగా స్వాగతించారు. ఆది శ్రీనివాస్ ముందుగా బాల రాజేశ్వరుడు , కాలభైరవుడు, పరివార దేవతల దర్శనం చేసుకుని, అనంతరం మహామండపంలో కొలువైన శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి రాజరాజేశ్వర స్వామి వారి వద్ద బిల్వ పూజ, అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అద్దాల మండపంలో ప్రధాన అర్చకులు, ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులు మరియు అర్చక సిబ్బంది వేదొక్త ఆశీర్వచనాలు అందజేశారు.

రాజన్న ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎల్. రమాదేవి ఆది శ్రీనివాస్ కు శేష వస్త్రం సమర్పించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆలయ కార్యనిర్వాహణాధికారికి, ఆలయ ఉద్యోగులకు మరియు అర్చకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి తమ నిబద్ధతను కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



ఆది జన్మదినం సందర్భంగా ఆలయ ఉద్యోగుల ఘన సన్మానం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఘన సత్కార కార్యక్రమం దేవస్థానం చైర్మన్ గెస్ట్ హౌస్ నందు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని ఆలయ ఉద్యోగులు కొనియాడుతూ యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆది శ్రీనివాసులు ఉద్యోగుల బృందం శాలువాతో సత్కరించి, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన అంకితభావం, సేవలను కొనియాడుతూ రాతపూర్వక మెమొంటోను బహుకరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ ఉద్యోగుల సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ యూనియన్ నాయకులు, ఆలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడీ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన వేములవాడ రూరల్ బిజెపి పార్టీ శ్రేణులు.




వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర మరియు జిల్లా పార్టీ పిలుపుమేరకు వేములవాడ రూరల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా పక్షం ( సేవా పక్వాడ ) కార్యక్రమంలో భాగంగా వేములవాడ రూరల్ మండలం నమిలి గుండుపల్లి గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. హనుమాజీపేట ఉన్నత పాఠశాలలో మోడీ 75 వ జన్మదినాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి







భోజనం చేసి, మిడ్ డే మీల్స్ ను పరిశీలించారు. తదనంతరం విద్యార్థిని, విద్యార్థులకు వికసిక్ భారత్ ఆత్మ నిర్భయ భారత్, ఆపరేషన్ సింధు అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ మోడీ నేతృత్వంలో భారతదేశం చెందుతున్న అభివృద్ధిని గురించి, ఆపరేషన్ సింధూర్ లో భారత దేశ విజయాన్ని, భారతదేశ ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండాలంటే యువత ఉద్యోగులపై కాకుండా పారిశ్రామికీకరణ వస్తు ఉత్పత్తి పై దృష్టి దారి సాధించాలని అప్పుడే దేశం ఆర్థికంగా ముందుకు వెళ్తుంది అన్నారు. మేకింగ్ ఇండియాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎం ఎస్ ఎం ఈ లకు అనేక రాయితీలను ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం యాదవ్, మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, ఉపాధ్యక్షులు లింగంపల్లి కొండయ్య, గుంటి వంశీకృష్ణ, పల్లికొండ నారాయణ, కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్చార్జి చింతకుంట గౌతమ్, బూత్ అధ్యక్షులు రెడ్ల మహేష్, ఆడెపు విజయ్, కల్లెడ నరేష్, ఆది జలంధర్, నల్ల వెంకట్రెడ్డి, లక్కం తిరుపతి, మారం రాజేందర్, చొప్పరి కరుణాకర్, లింగంపల్లి కిషోర్, శక్తి కేంద్రం ప్రముఖ ఉప్పుల గౌతం, సీనియర్ నాయకులు జంకె మధు, సామోజి గౌతమ్, గుజ్జుల గంగారెడ్డి, చందనగిరి శ్రీనివాస్, పెద్దపల్లి మనోజ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మార్వాడీ హటావో కు వ్యతిరేకం

కుత్బుల్లాపూర్ : మాజీ యమ్.యల్.ఏ మైనంపల్లి హనుమంత్ రావు మీడియాతో మాట్లాడారు. మనమంతా భారతీయులం. భారతీయులంతా ఎక్కడైనా జీవించవచ్చు. మార్వాడీ హటావో నినాదానికి నేను వ్యతిరేకం. ఇది ఏ రాజకీయ పార్టీకి సంభదం లేదు....అందరికి ఒక్కటే రాజ్యాంగం...అందరికీ ఒక్కటే పాస్ పోర్ట్. విదేశాలలో మన భారతీయులు ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాదు మినీ ఇండియా. వివిధ రాష్ట్రాలలో మన తెలంగాణ వారు స్థిర నివాస ఏర్పచుకొన్నారు. ఈ భీజం పెరిగి పెద్దదైతే మనమే నష్ట పోతాము.. అభివృద్ధి కుంటు పడుతుంది. కులాల వారిగా మతాల వారిగా విడిపోతే నష్టపోయేది మనమే. నీవు నేను కలిస్తే మనం. మనం మనం కలిస్తే జనం. ఎక్కడో జరిగిన పొరపాటు ఇక్కడ రుద్దడం సరికాదు,,,,తప్పు చేసిన వారు శిక్షార్హులు....అందరు కలసి సమైక్యంగా కలిసి ఉందామని పిలుపునిచ్చారు.









Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com